ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY


హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	:18004251442
యాదాద్రి	:1800 425 7106
సూర్యాపేట	:1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 84

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.124	200	220
సూర్యాపేట	రూ.110	155	177
నల్లగొండ	రూ.107	160	180

ఉష్ణోగ్రత గరిష్ఠం 29.5 । కనిష్ఠం 16.4

అధనపు భారం రూ.55కోట్లు



» సింగిల్ పర్మిట్ లేక చిక్కులు » వస్తు రవాణా వాహనాలపై ఆర్థిక భారం

» లారీ వెళ్లొస్తే పర్మిట్‌కు రూ.2వేలు » చెక్‌పోస్టులు ఎత్తివేయాలన్న కేంద్రం » పాటించని ఇరు రాష్ట్రాలు

» చెక్‌పోస్టుల వద్ద సిబ్బంది మామూళ్ల వసూలు!

ఉమ్మడి రాష్ట్రం విడిపోయాక సింగిల్ పర్మిట్ విధానం అమలు కాకపోవడంతో వస్తు రవాణా వాహనాల యజమానులపై పన్నుల భారం పడుతోంది. సింగిల్ పర్మిట్ విధానంలో నిబంధనల మేరకు రూ.5వేలు చెల్లిస్తే ఒక లారీ ఏడాదిలో ఎన్నిసార్లయినా పక్కపక్క రాష్ట్రాలకు వస్తు రవాణా చేయవచ్చు. అయితే రాష్ట్ర ఏర్పాటు అనంతరం ఈ విధానం అమలు కాకపోవటంతో తాము తీవ్రంగా నష్టపోతున్నామని లారీ యజమానులు వాపోతున్నారు.

● కోదాడ

రాష్ట్ర ఏర్పాటు అనంతరం 158జీవో ప్రకారం 2015-16లో సరిహద్దులో చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. అందులో భాగంగా ఉమ్మడి నల్లగొండ జిల్లాలో కోదాడ సమీపంలో రామాపురం క్రాస్ రోడ్డు వద్ద, మిర్యాలగూడ సమీపంలోని వాడపల్లి, నాగార్జునసాగర్‌లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. ఈ చెక్‌పోస్టుల ఏర్పాటుతో ఇరు రాష్ట్రాలకు సరుకు రవాణా చేసేందుకు వారం పర్మిట్‌కు (ఒకసారి వెళ్లొచ్చేందుకు) రూ.2వేలు, నెలకు రూ.5వేలు ఏడాదికి రూ.60వేలు లారీ యజమానులు చెల్లిస్తున్నారు. నేషనల్ పర్మిట్ నిబంధన ప్రకారం కొత్త లారీ కొనుగోలు చేసినప్పుడే రూ.19వేలు పర్మిట్లకు చెల్లిస్తారు. దీంతో లారీ దేశంలో ఎక్కడికైనా, ఎన్నిమార్లయినా తిరిగి రావొచ్చు. అయితే 12 ఏళ్లు దాటిన లారీలకు నేషనల్ పర్మిట్ నిబంధన వర్తించదు. ఫలితంగా పక్కపక్క రాష్ట్రాలకు సరుకు రవాణకు సింగిల్ పర్మిట్ తీసుకోవాలి. సింగిల్ పర్మిట్‌కు ఏడాదికి రూ.5వేలు కడితే సరిపోతుంది. తెలంగాణ సరిహద్దులో ఉన్న తమిళనాడు, కర్నాటకతోపాటు ఇతర రాష్ట్రాలలో ఈ సింగిల్ పర్మిట్ విధానం అమలులో ఉంది. అయితే తెలంగాణ, ఏపీ మధ్య మాత్రం సింగిల్ పర్మిట్ విధానం అమలు కాకపోవడంతో నెలకు రూ.5వేల చొప్పున ఏడాదికి రూ.60వేలు చెల్లించాల్సి వస్తోందని లారీ యజమానులు గగ్గోలు పెడుతున్నారు. వీటికి తోడు లారీకి అన్ని పేపర్లు సక్రమంగా ఉన్నా, సరిహద్దు వద్ద ఉన్న చెక్‌పోస్టులో ఒక్కో లారీ నుంచి రూ.600 వరకు ముడుపులు తీసుకుంటున్నారని వారు ఆరోపిస్తున్నారు. ఒక్క కోదాడ సమీపంలోని రామాపురం చెక్‌పోస్టు నుంచి నిత్యం 400 వస్తు రవాణా లారీలు ప్రయాణిస్తున్నాయి. ముడుపుల చొప్పున లారీల యజమానులు రోజుకు రూ.2.40లక్షలు సమర్పిస్తున్నట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా, ఉమ్మడి జిల్లా చెక్‌పోస్టుల ద్వారా నిత్యం సుమారు 1200 వాహనాల్లో సరుకు రవాణా అవుతోందని లారీ యజమానులు చెబుతున్నారు. వాహనానికి అన్ని పేపర్లు ఉన్నా చెక్‌పోస్టుల వద్ద రూ.600 చొప్పున మామూళ్లు వసూలు చేస్తుండటంతో 1200 వాహనాలకు రోజుకు రూ.7.20లక్షలు అవుతోందని వారు పేర్కొంటున్నారు. వీటికి తోడు ట్యాక్స్‌ల అదనపు భారంతో లారీలు నడపలేకపోతున్నామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదం చేసి పారిపోయే డ్రైవర్లకు రూ.7లక్షల జరిమానా, 10 ఏళ్ల జైలుశిక్ష చట్టాన్ని తీసుకురావాలనే కేంద్ర ప్రభుత్వ నిర్ణయంతో డ్రైవర్లు పనిచేసేందుకు ఇష్టపడరని, ఫలితంగా రవాణ రంగం మనుగడ కష్టమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే సరిహద్దు చెక్‌పోస్టులను ఎత్తివేయాలని కేంద్రం చెప్పినట్టుగా అమలుచేయాలని, మామూళ్లకు చెక్‌పెట్టి, హిట్ అండ్ రన్ చట్టాన్ని ఉపసంహరించుకోవాలని కోరుతున్నారు.

రవాణా రంగానికి ప్రభుత్వం అండగా ఉండాలి



దేశ ప్రజలకు అవసరాలైన నిత్యావసర వస్తువులు రాత్రి, పగలు అనే తేడా లేకుండా సరఫరా చేస్తున్నాం. ఈ రంగానికి అండగా ఉండాల్సిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పన్నులు పెంచుతూ, జరిమానాలు, మామూళ్ల వసూలు చేయడం తగదు. ఇప్పటికే డీజిల్ ధరలు పెరిగాయి. కిరాయిలు లేక ఇబ్బందులు పడుతున్నాం. రవాణారంగం సాఫీగా నడవాలంటే విభజన చట్టంలోని హామీలను అమలు చేసి, లారీ యజమానులపై భారం పడకుండా చూడాలి.

గుమ్మడి దుర్గప్రసాద్, లారీ అసోసియేషన్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి

● రూ.55కోట్ల అదనపు భారం ఇలా..

ఉమ్మడి జిల్లాలో 10వేలకు పైగా గూడ్స్ వాహనాలు ఉన్నాయి. వాటిలో నిత్యం ఇరు రాష్ట్రాలకు సరుకు రవాణా అవుతోంది. జిల్లా నుంచి సిమెంట్, ధాన్యం, పప్పులు, పాలు, గ్యాస్, పెట్రోల్, డీజిల్ లాంటి నిత్యావసర వస్తువులు సరఫరా అవుతున్నాయి. ఉమ్మడి జిల్లాలో 7వేల మంది లారీ ఓనర్లు ఉన్నారు. సింగిల్ పర్మిట్ విధానం ప్రకారం 10వేల వాహనాలకు రూ.5వేల చొప్పున రూ.5కోట్లు అవుతోంది. సింగిల్ పర్మిట్ విధానం లేకపోవడంతో రెండు రాష్ట్రాల మధ్య వాహనాలను నడిపేందుకు 11 నెలల కాలానికి రూ.55కోట్లు అదనంగా చెల్లిస్తున్నారు. పక్క రాష్ట్రాలకు సింగిల్ పర్మిట్ నిబంధన ఉన్నా, ఇరు రాష్ట్రాల సీఎంలు దృష్టి సారించకపోవడంతో ఆర్థికభారం లారీ యజమానులపై ఆర్థిక భారం పడుతోంది. ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్టులను ఎత్తివేయాలని కేంద్ర ప్రభుత్వం 2019లో చెప్పినా ఇరు రాష్ట్ర ప్రభుత్వాలు పాటిచడం లేదు.

● పెరిగిన పెట్టుబడులు, ఖర్చులు




1994లో 12టైర్ల లారీపై పెట్టుబడి రూ.4.80లక్షలుగా ఉండేది. 12శాతం వడ్డీతో, 20శాతం డౌన్ పేమెంట్‌తో లారీ తీసుకొనేవారం. నేడు అదే లారీకి రూ.18లక్షల పెట్టుబడి పెడుతున్నాం. ఇంకోపక్క పెరుగుతున్న రవాణా ఖర్చులతో లారీలు నడపలేకపోతున్నాం. హైదరాబాద్ నుంచి వయా వాడపల్లి మద్రాస్‌కు సుమారు 700కి.మీ సరుకు రవాణాకు రూ.8వేలకు పైగా ఖర్చు వస్తోంది. టన్నుకు కిరాయి రూ.1300కాగా, 17టన్నులకు వచ్చేది రూ.22,110. హైదరాబాద్‌లో గుమస్తా మామూళ్ల రూ.90, బ్రోకర్ మామూళ్ల రూ.500, టోల్‌గేట్ చార్జీలు రూ.2,800, దిగుమతి మామూళ్ల రూ.110, మద్రాస్‌లో బ్రోకర్ మామూళ్ల రూ.400, ఆర్టీవో నాలుగు చెక్‌పోస్టుల వద్ద మామూళ్ల రూ.800లు, నాలుగు కమర్షియల్ చెక్‌పోస్టుల వద్ద రూ.800. ఇక పోలీసు మామూళ్ల సుమారు రూ.1000, తెలంగాణలో టోల్‌గేట్‌ల వద్ద రూ.1800 మొత్తం కలిపి రూ.8,300 పైగా రవాణా ఖర్చు వస్తోంది. ఇన్ని ఇబ్బందులతో వాహనాలు నడుపుతున్న లారీ యజమానులకు సింగిల్ పర్మిట్ విధానాన్ని చేయాలి. చెక్‌పోస్టులు ఎత్తివేసి, మామూళ్లకు స్వస్తి పలికాలి. ఈ నెల 10 లేదంటే 11వ తేదీన సీఎం రేవంత్‌రెడ్డి, ఏపీ సీఎం జగన్‌తో లారీ యజమానులు సమావేశం కానున్నాం. ఈ సమావేశంలో రెండు రాష్ట్రాల సీఎంలు సానుకూల నిర్ణయం తీసుకొని సింగిల్ పర్మిట్ విధానంతోపాటు, చెక్‌పోస్టుల ఎత్తివేతకు నిర్ణయం తీసుకోవాలి.

కనగాల నాగేశ్వరరావు, ఏఐఎంటీసీ మేనేజింగ్ కమిటీ సభ్యుడు

టీచర్లపై టెట్ పిడుగు

» పదోన్నతులకు అడ్డంకి » విద్యారంగంలో గందరగోళ పరిస్థితి



భువనగిరి అర్బన్, జనవరి 4: టెట్ (ఉపాధ్యాయ అర్హత పరీక్ష) సీనియర్ ఉపాధ్యాయుల పదోన్నతులకు ప్రస్తుతం గుదిబండలా మారింది. పదోన్నతులు పొందాలనుకునే వారు టెట్ తప్పనిసరి ఉత్తీర్ణులై ఉండాలని ఇటీవల హైకోర్టు స్పష్టం చేసింది. ఇది సీనియర్ ఉపాధ్యాయులకు పిడుగులాంటిదే. దీంతో ప్రస్తుతం ఉపాధ్యాయ వర్గాల్లో గందరగోళం నెలకొంది. టెట్ నిబంధన పాటించాలనే కోర్టు ఉత్తర్వు ఉపాధ్యాయ వర్గాల్లో ఉత్కంఠ రేపుతోంది. 2008 సంవత్సరంలో టెట్ ప్రారంభం కాగా, తరువాత కొన్నేళ్లకు నేషనల్ కౌన్సిల్ ఫర్ టీచర్ ఎడ్యుకేషన్ (ఎన్సీటీఈ) ప్రతీ ఉపాధ్యాయుడికి ఉత్తీర్ణత తప్పనిసరి చేస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. కాగా, ఐదు దఫాలుగా 1996 నుంచి 2008 వరకు జరిగిన డీఎస్సీలో ఉపాధ్యాయులుగా ఉన్న వారిలో చాలా మందికి టెట్ అర్హత లేదు. వీరికి ఇప్పుడు పదోన్నతి దక్కుతుందో? లేదోనని ఆందోళన నెలకొంది. ఉమ్మడి జిల్లాలో 70శాతం టెట్ అర్హత లేని ఉపాధ్యాయులు ఉండగా కేవలం 30శాతం మందికే ఈ అర్హత ఉంది. యాదాద్రి జిల్లాలో 3,465 పోస్టులకు 2,831 మంది ఉపాధ్యాయులు మాత్రమే విధులు నిర్వర్తిస్తున్నారు. వీరికి ఎన్సీటీఈ నిర్ణయంతో పెద్ద ఇబ్బందే. ఉపాధ్యాయ పదోన్నతులు, బదిలీలు గత ఏడాది అక్టోబరులోనే చేపట్టాల్సి ఉండగా, హైకోర్టు ఉత్తర్వులతో నిలిచిపోయింది. ఎన్సీటీఈ ఉత్తర్వులపై విద్యాశాఖ ఎలాంటి నిర్ణయం తీసుకోనుందనే దానిపై ఉపాధ్యాయవర్గాల్లో కలవరం మొదలైంది. 2012, 2017 టెట్‌లో ఉత్తీర్ణులైన ఉపాధ్యాయులు మాత్రం తమకు ప్రాధాన్యం లభిస్తుందని అంటున్నారు.

సీనియర్లకు అన్యాయం జరగొద్దు



టెట్ పేరుతో కొన్నేళ్లుగా కొనసాగుతున్న ఉపాధ్యాయులకు అన్యాయం చేయవద్దు. టెట్ అర్హత తప్పనిసరి కావాలంటే సీనియర్ ఉపాధ్యాయులకు ఇన్ సర్వీస్‌లో పరీక్షలు రాసుకునే వెసులుబాటు కల్పించాలి. ప్రభుత్వం నుంచి పదోన్నతులు పొందకుండానే చాలామంది పదవీ విరమణ చేయాల్సి వస్తోంది. ప్రభుత్వం పునరాలోచన చేసి సీనియర్లు, జూనియర్ ఉపాధ్యాయులకు ఎలాంటి అన్యాయం జరగకుండా చూడాలి.

- పాశం కృష్ణమూర్తి, జీటీఏ యాదాద్రి జిల్లా అధ్యక్షుడు

ఇద్దరు టీచర్లకు షోకాజ్ నోటీసులు



బీబీనగర్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థి నైపుణ్యాన్ని పరిశీలిస్తున్న డీఈవో నారాయణ రెడ్డి

బీబీనగర్, జనవరి 4: విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఇద్దరు టీచర్లకు డీఈవో నారాయణరెడ్డి షోకాజ్ నోటీసులు జారీచేశారు. గురువారం డీఈవో బీబీనగర్ మండలంలోని బీబీనగర్, రంగాపురం, జైనపల్లి గ్రామాల్లోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీచేశారు. పాఠశాలల్లో అమలవుతున్న తొలిమెట్టు కార్యక్రమానికి సంబంధించిన సూచనలను అమలు చేయడంలో, అభ్యసన దీపికలను విద్యార్థులతో పూర్తి చేయించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన రంగాపురం ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు బి.పద్మశ్రీ, బీబీనగర్ బాలికల ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు బ్రిగ్రాస్ పాలీనాలకు డీఈవో షోకాజ్ నోటీసులు జారీచేశారు. అంతకుముందు ఆయన పాఠశాలలో అమలవుతున్న తొలిమెట్టు కార్యక్రమాన్ని పరిశీలించారు. విద్యార్థుల్లో పఠనం, లేఖనం, అంకగణిత సామర్థ్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులకు అభ్యసనానికి సంబంధించి పలు సూచనలు చేశారు. తొలిమెట్టు కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని, విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

● కలెక్టర్ హనుమంతు కే.జెండగే



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ హనుమంతు కే.జెండగే

భువనగిరి అర్బన్, జనవరి 4: ఎస్సీ, ఎస్టీ, బీసీ, జనరల్ కేటగిరీ విద్యార్థులకు గురుకుల పాఠశాలల్లో ప్రవేశాలకోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కలెక్టర్ హనుమంతు కే.జెండగే చెప్పారు. కలెక్టరేట్‌లో గురుకుల పాఠశాలల ఉమ్మడి ప్రవేశ పరీక్షలకు సంబంధించిన పోస్టర్‌ను గురువారం ఆవిష్కరించి మాట్లాడారు. 2024 ఫిబ్రవరి 11న వీటీజీ, జీఈటీ ప్రవేశ పరీక్ష ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంటకు ఎంపిక చేసిన కేంద్రాల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. 2023-24 విద్యాసంవత్సరంలో నాలుగో తరగతి ఉత్తీర్ణత సాధించిన వారు మాత్రమే అర్హులన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఈ నెల 6వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో రూ.100 ఫీజు చెల్లించి, బోనఫైడ్ సర్టిఫికెట్, కుల ధ్రువీకరణ పత్రంతో దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో భువనగిరి గురుకుల డీసీవో శ్రీరాం, రాజపేట ప్రిన్సిపల్ నర్సింహాచారి, వైస్ ప్రిన్సిపల్ గాయత్రి, పీజీపీ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

రేపటి లోగా దరఖాస్తు చేసుకోవాలి

మోత్కూరు: గురుకుల పాఠశాలల్లో 5వ తరగతిలో ప్రవేశం పొందేందుకు ఫిబ్రవరి 11న నిర్వహించనున్న గురుకుల ఉమ్మడి ప్రవేశ పరీక్ష రాయడానికి ఈ నెల 6వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా రూ.100 రుసుం చెల్లించి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని మోత్కూరు బాలుర గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్.వెంకటస్వామి కోరారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ విద్యా సంవత్సరంలో నాలుగో తరగతి చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. పూర్తి వివరాలను గురుకుల పాఠశాలల సొసైటీ లేదా ఎస్సీ, ఎస్టీ, బీసీ బాలుర, బాలికల గురుకుల పాఠశాలల ప్రిన్సిపాల్స్ నుంచి పొందవచ్చన్నారు.

సీఎంఆర్ లక్ష్యం పూర్తి చేయాలి

● అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు



గోదాములో వివరాలు తెలుసుకుంటున్న భాస్కర్‌రావు

భువనగిరి రూరల్, జనవరి 4: సకాలంలో సీఎంఆర్ లక్ష్యం పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు అన్నారు. గురువారం భువనగిరి మండలం నాగిరెడ్డిపల్లి శివారులో గల స్టేట్ వేర్ హౌస్ కార్పొరేషన్ (ఎస్‌డబ్ల్యూసీ) గోదామును ఆయన తనిఖీచేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, గోదాములోని ధాన్యాన్ని త్వరగా దిగుమతి చేసుకొని, కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) లక్ష్యాన్ని పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఎఫ్‌సీఐ అసిస్టెంట్ మేనేజర్ రవికుమార్‌కు సూచించారు. ధాన్యం నాణ్యతా ప్రమాణాలను పాటించాలన్నారు. ఆయన వెంట సివిల్ సప్లై జిల్లా మేనేజర్ గోపీకృష్ణ, జిల్లా పౌరసరఫరాల అధికారి శ్రీనివాస్ రెడ్డి, ఎస్‌డబ్ల్యూసీ మేనేజర్ యాదయ్య ఉన్నారు.

38,281 'ప్రజాపాలన' దరఖాస్తులు



దత్తప్పగూడెంలో దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు

భువనగిరి అర్బన్, జనవరి 4: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమంలో గురువారం 38,281 దరఖాస్తులు వచ్చాయి. ఆరు గ్యారంటీ పథకాల దరఖాస్తుల కోసం జిల్లావ్యాప్తంగా 68 గ్రామసభలు నిర్వహించి ఉదయం 8నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, మధ్యాహ్నం 2నుంచి సాయంత్రం 6గంటల వరకు రెండు షిఫ్టుల్లో కొనసాగింది. దరఖాస్తులు పూర్తి చేసేందుకు హెల్ప్‌డెస్క్‌ను ఏర్పాటుచేశారు.

ఉమ్మడి జిల్లాలో ఇప్పటి వరకు 'ప్రజాపాలన' దరఖాస్తులు ఇలా..

తేదీ	యాదాద్రి	సూర్యాపేట	నల్లగొండ	మొత్తం
డిసెంబరు 28	11,132	8,809	23,593	43,534
29	20,475	35,109	37,750	93,334
30	35,474	56,874	69,747	1,62,095
31	సెలవు	-	-	-
జనవరి 1	సెలవు	-	-	-
2	39,033	70,953	82,272	1,92,258
3	42,148	58,271	73,724	1,74,143
4	38,281	51,547	77,670	1,67498
మొత్తం	1,86,543	2,81,563	3,64,756	8,32,862





నల్లగొండ పానగల్ రోడ్డులోని ఫ్లైఓవర్‌పై కమ్ముకున్న మంచు

మంచు సోయగం

మంచుసోయగం మంత్రముగ్ధుల్ని చేస్తోంది. అందమైన ప్రకృతి ఒడిలో కురుస్తున్న ఈ తుషారం గురువారం కూడా కనువిందు చేసింది. ఇక ఉదయాన్నే ప్రయాణం చేద్దామనుకుంటున్న వాహనదారులకు కాస్త ఇబ్బందిగానే మారింది. మంచుతో ఎదురుగా వచ్చే వాహనాలు కన్పించకపోవడంతో నెమ్మదిగా వెళుతున్నారు.





నల్లగొండలో లైట్ల వెలుతురులో వాహనాలు



నల్లగొండలో మంచులో వాకింగ్ చేస్తున్న పట్టణవాసులు



శ్రమైక జీవనం

సాగుకాలం మొదలు కావడంతో రైతులు బిజిబిజీగా మారారు. ఉదయం నుంచి రాత్రి పొద్దుపోయే వరకు పొలం పనుల్లో నిమగ్నమవుతున్నారు. నల్లగొండ జిల్లాకేంద్రం పరిధిలో కతాల్‌గూడలో మహిళా రైతులు వరి నాటు వేసే పనులు చకచకా చేసేస్తున్నారు.

(స్టాఫ్ ఫొటోగ్రాఫర్-నల్లగొండ)





కష్టపడినా కనికరించలేదు

● తెలంగాణ విద్యుత్ ఇంజనీర్లకు తీవ్ర అన్యాయం ● ఆంధ్రా ఉద్యోగుల కోసం రివర్షన్ ● కొత్త ప్రభుత్వం పట్టించుకోవాలని వేడుకోలు

మిర్యాలగూడ, జనవరి 4: తెలంగాణ రాష్ట్ర ప్రజల విద్యుత్ అవసరాలు తీర్చడంకోసం నిరంతరం కష్టపడితే గత ప్రభుత్వం కనికరమే చూపలేదని జెన్‌కో, ట్రాన్స్‌కో విద్యుత్ ఉద్యోగులు వాపోతున్నారు. విద్యుత్ సంస్థల్లో ఆంధ్రా ఉద్యోగులకు ఉన్న విలువ తమకు లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కరెంటు కోతలతో ఇబ్బందులు పడుతున్న తెలంగాణ రైతాంగానికి ఇబ్బందుల్లేకుండా చూసేందుకు విద్యుత్ ఉద్యోగులు తీవ్రంగా శ్రమిస్తే రివర్షన్ ఇచ్చి అవమానాలకు గురిచేశారని విచారం వ్యక్తం చేస్తున్నారు.

ఆంధ్రాకు వెళ్లకుండా..

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత 60:40 నిష్పత్తి ప్రకారం జెన్‌కో, ట్రాన్స్‌కోలలో పనిచేస్తున్న ఉద్యోగులు ఆంధ్రప్రదేశ్‌కు వెళ్లిపోవాలని నిర్ణయించారు. 3,720మంది ఇంజనీరింగ్, అకౌంట్స్ విభాగాల్లోని ఉద్యోగుల్లో 1,250మంది ఇంజనీర్లను 2015 జూన్‌లో ఆంధ్రప్రదేశ్‌కు పంపారు. ఖాళీ అయిన పోస్టుల్లో తెలంగాణ కేడర్‌కు పదోన్నతి ఇచ్చి పోస్టింగ్‌లు కల్పించారు. స్థానికంగా ఉన్న ఉద్యోగులతోనే సబ్‌స్టేషన్ల నిర్వహణ, పవర్‌జనరేట్ సెంటర్లలో డబుల్, త్రిబుల్ డ్యూటీలుచేసి విద్యుత్ వెలుగులు అందించినట్లు తెలంగాణ ఉద్యోగులు చెబుతున్నారు. ఆంధ్రాలోని తెలంగాణ రాష్ట్ర ఉద్యోగులు 250మంది తెలంగాణకు వచ్చి విధుల్లో చేరినట్లు చెబుతున్నారు. తక్కువమంది ఉద్యోగులతోనే తెలంగాణ విద్యుత్ సంస్థల్లో చురుకుగా పనిచేసి నిరంతరం విద్యుత్ సరఫరాకు తమ శాయశక్తులా కృషి చేశామని, అయినప్పటికీ సంస్థ యాజమాన్యాలకు తమపై కనికరం లేకుండా పోయిందని ఆవేదన చెందుతున్నారు. కాగా ఏపీకి బదిలీ అయిన విద్యుత్ ఉద్యోగులు విధుల్లో చేరకుండా తెలంగాణలోనే కొలువు చేస్తామని కోర్టుకెక్కినట్లు ఆరోపిస్తున్నారు.

వన్‌మ్యాన్ కమిటీతో విచారణ

ఈ సమస్యపై సుప్రీంకోర్టు వన్‌మ్యాన్ కమిటీ వేసి విచారణకు ఆదేశించింది. తెలంగాణ ఉద్యోగులకు పదోన్నతులు, నియామకాల్లో అన్యాయం జరిగిందని పేర్కొంటూ వన్‌మ్యాన్ కమిటీ తొలుత ఏపీ ఉద్యోగులు ఏపీలోనే జాయిన్‌కావాలని 2020లో తీర్పునిచ్చింది. ఈ నేపథ్యంలో తీర్పులో స్పష్టతలేదని ఆంధ్రా ఉద్యోగులు తిరిగి దేశ అత్యున్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించగా నిబంధనల్లో సవరణలు, తప్పులు ఏవైనా ఉన్నాయో పరిశీలించాలని వన్‌మ్యాన్ కమిటీకి సుప్రీంకోర్టు సూచించింది. మొదటి తీర్పు తమకు అనుకూలంగా ఉన్నందున తెలంగాణ ఉద్యోగులు న్యాయస్థానం సూచనను సీరియస్‌గా తీసుకోలేదు. రెండోసారి తీర్పులో ఆంధ్రా ఉద్యోగులకు తెలంగాణలో ఉద్యోగాలు ఇవ్వాలని న్యాయాధికారి జడ్జిమెంట్ ఇచ్చారు. దీంతో గతంలో ఏపీకి బదిలీ చేసిన 1,250 మంది ఉద్యోగులకు తోడు అదనంగా మరో 500 మంది ఉద్యోగుల్లో తెలంగాణ రాష్ట్రంలో జాయిన్ అయినట్లు తెలంగాణ విద్యుత్ ఉద్యోగులు స్పష్టం చేస్తున్నారు.

తెలంగాణ ఇంజనీర్లకు రివర్షన్

ఆంధ్రప్రదేశ్‌కు బదిలీ అయి తిరిగి తెలంగాణలో జాయిన్ అయిన ఇంజనీర్లకు ప్రమోషన్ కల్పించే నెపంతో గత ఏడేళ్ల క్రితం తెలంగాణ ఇంజనీర్లకు ఇచ్చిన ప్రమోషన్లను 2022లో 167మందికి ప్రభుత్వం రివర్షన్ ఇచ్చింది. సూపర్‌న్యూమరీ పోస్టులను క్రియేట్ చేయాలని కోరినా గత యాజమాన్యం ప్రభుత్వం నుంచి అనుమతి తీసుకుని క్రియేట్ చేస్తామని రివర్షన్ పొందిన ఇంజనీర్లకు వాగ్దానంచేసి తిరిగి పట్టించుకోలేదు. ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో ముందు భాగంలో ఉండి పోరాడినందుకు, దేశంలోనే తెలంగాణ రాష్ట్రానికి నిరంతరాయ విద్యుత్ సరఫరా చేసేందుకు తీవ్రంగా శ్రమించి చివరకు ఆత్మగౌరవం కోల్పోయి అవమానాలు పడాల్సి వస్తోందని ఇంజనీర్లు వాపోతున్నారు. నూతన కాంగ్రెస్ ప్రభుత్వంలో తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి విద్యుత్ ఇంజనీరింగ్ ఉద్యోగుల సమస్యపై ప్రత్యేక దృష్టి సారించి పరిష్కరించాలని కోరుతున్నారు.



తమ సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరాలని నల్లగొండ జిల్లా మిర్యాలగూడ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న విద్యుత్ ఇంజనీర్ల సంఘం నాయకులు(ఫైల్)

గత ప్రభుత్వం హామీ ఇచ్చి మోసం చేసింది

రివర్షన్ ఇచ్చిన ఇంజనీర్లను గత ప్రభుత్వం వారంలో అదే పోస్టులో రీఇన్‌స్టిట్యూట్ చేస్తామని హామీ ఇచ్చి మోసం చేసింది. న్యాయంకోసం అప్పటి సీఎండీ కోర్టుకు కూడా వెళ్లనివ్వలేదు. ఏడేళ్లకు పైగా ప్రమోషన్ చేసిన స్థానాల్లో సేవలందించిన ఇంజనీర్లను రివర్షన్ చేయడం అన్యాయం. ప్రస్తుత ప్రభుత్వం సీరియస్‌గా సమస్యలపై దృష్టి సారించి న్యాయం చేయాలి.

ఎం.గిరిబాబు, తెలంగాణ విద్యుత్ ఇంజనీర్స్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్

వేర్వేరు కారణాలతో ముగ్గురి ఆత్మహత్య


గంధమల్ల శ్రీను(ఫైల్)

ఆలేరు రూరల్, శాలిగౌరారం, జనవరి 4: వేర్వేరు కారణాలతో నల్లగొండ, యాదాద్రిభువనగిరి జిల్లాల్లో ముగ్గురు ఆత్మహత్య చేసుకున్నారు. యాదాద్రిభువనగిరి జిల్లా ఆలేరు మండలంలోని కొలనుపాగ్రామానికి చెందిన గంధమల్ల శ్రీను (26) కొద్ది నెలలుగా మానసిక ఆందోళనతో బాధపడుతున్నాడు. గురువారం ఇంట్లో ఉన్న గడ్డి నివారణ మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. గమనించిన కుటుంబ సభ్యులు శ్రీనును చికిత్స నిమిత్తం ఆలేరులోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం పరిస్థితి విషమించడంతో భువనగిరి ఏరియా ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందాడని వైద్యులు తెలిపారు. ఈ విషయమై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఆలేరు ఎస్‌ఐ వెంకట శ్రీను తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వివాహిత


కావ్య (ఫైల్)

ఆలేరు మండలకేంద్రంలోని రెడ్డిగూడెంకాలనీలో అనుమానాస్పదస్థితిలో వివాహిత మృతిచెందింది. మోటకొండూరు మండలం మాటూరు గ్రామానికి చెందిన మచ్చ కావ్య(22)కు యాదగిరిగుట్ట మండలం బాహుపేటకు చెందిన మచ్చ శ్రీనివాస్‌తో ఆరు నెలల క్రితం వివాహం జరిగింది. వారు ఆలేరులోని రెడ్డిగూడెంలో నివాసముంటున్నారు. బుధవారం సాయంత్రం కావ్య ఇంట్లోని తన గదిలో ఆత్మహత్యకు పాల్పడింది. ఇంట్లోనే ఉన్న భర్త శ్రీనివాస్ గుర్తించి చుట్టుపక్కల వారి సాయంతో చికిత్స కోసం ఆలేరులోని ఏరియా ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ అదే రోజు సాయంత్రం మృతిచెందింది. వరకట్న వేధింపులతోనే హత్యచేసి ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నారని కావ్య తండ్రి దరిగె శంకరయ్య ఆరోపించారు. అయన ఫిర్యాదు మేరకు కావ్య భర్త శ్రీనివాస్‌తో పాటు మరో నలుగురిపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ వెంకట శ్రీను తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆలేరు ఏరియా ఆసుపత్రికి తరలించారు.

అమ్మ తిట్టిందని..



శ్రీకాంత్(ఫైల్)

వ్యసనాలు మానుకోవాలని తల్లి మందలించడంతో మనస్తాపంతో కుమారుడు ఆత్మహత్య చేసుకున్నాడు. నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలం పెర్కకొండారం గ్రామంలో ఈ సంఘటన జరిగింది. ఎస్‌ఐ ఉప్పల సతీష్ తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన మాచర్ల అండాళ్ కుమారుడు శ్రీకాంత్(27) కొన్నేళ్లుగా గ్రామపంచాయతీలో మల్టీప ర్పస్ వర్కర్‌గా పనిచేస్తున్నాడు. తండ్రి చిన్ననాడే మృతిచెందగా, తల్లితో కలిసి ఉంటున్నాడు. శ్రీకాంత్ మద్యానికి బానిసై ప్రతిరోజూ మద్యం తాగి జల్సాగా తిరుగుతున్నాడు. తాగి తిరి గితే బాగుండదని, పెళ్లి చేయాలంటే పిల్లను ఎవరు ఇస్తారని తల్లి మంద లించింది. దీంతో మనస్తాపం చెందిన శ్రీకాంత్ బుధవారం సాయంత్రం గ్రామ పంచాయతీ మోటారు పెట్టి వస్తానని వెళ్లి అక్కడే పురుగుల మందు తాగాడు. అపస్మారక స్థితిలో ఉన్న శ్రీకాంత్‌ను అక్కడున్న కొందరు గమనించి తల్లికి సమాచారం ఇచ్చారు. వెంటనే తల్లి అండాళ్ సంఘటనా స్థలానికి చేరుకుని ప్రాణపాయ స్థితిలో ఉన్న శ్రీకాంత్‌ను నకిరేకల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతిచెందాడు. తల్లి అండాళ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సతీష్ తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

తిప్పర్తి, జనవరి 4: తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగింది. ఈ సంఘటన నల్లగొండ జిల్లా తిప్పర్తి మండల పరిధిలోని శిలార్‌మియాగూడెంలో గురువారం జరిగింది. ఎస్‌ఐ. ఎన్. ధర్మ తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన దాసరి శ్రీను తన భార్యతో కలిసి మధ్యాహ్నం 12గంటల సమయంలో పొలం పనులకు వెళ్లాడు. తిరిగి రెండు గంటల సమయంలో ఇంటికి వచ్చే సరికి ఇంటి తాళం పగులగొట్టి ఉంది. గమనించి ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువా తాళం పగలగొట్టిన గుర్తుతెలియని దుండగులు బీరువాలో ఉన్న రెండు తులాల పుస్తెల తాడు తీసుకెళ్లారు. చోరీ జరిగినట్లు నిర్ధారించుకున్న బాధితుడు శ్రీను సాయంత్రం తిప్పర్తి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

తాటిచెట్టుపై నుంచి పడి గీతకార్మికుడు మృతి


రవి(ఫైల్)

అర్వపల్లి, జనవరి 4: తాటిచెట్టుపై నుంచి పడి గీతకార్మికుడు మృతిచెందాడు. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా అర్వపల్లి మండలం అడివెంల గ్రామంలో గురువారం జరిగింది. బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మంగ రవి(40) వృత్తిలో భాగంగా రోజు మాదిరిగా గురువారం ఉదయం కోమటిపల్లి గ్రామ శివారులో తాటి చెట్టును ఎక్కుతుండగా కాలు జారడంతో తాటిచెట్టుపై నుంచి కిందపడడంతో తీవ్రంగా గాయపడ్డాడు. ఆస్పత్రికి తరలి స్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. రవికి భార్య, కుమారుడు ఉన్నారు. రవి మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

మైనర్లు వాహనాలు నడిపితే కఠిన చర్యలు

నల్లగొండ, జనవరి 4: మైనర్లు వాహనాలు నడుపుతూ పట్టుబడితే చర్యలు తప్పవని ట్రాఫిక్ సీఐ డానియేల్ అన్నారు. వాహనాలు నడుపుతూ పట్టుబడ్డ 21మంది మైనర్లకు నల్లగొండ జిల్లాకేంద్రంలోని పోలీస్ కార్యాలయంలోని ట్రాఫిక్ ట్రైనీ ఇనిస్టిట్యూట్‌లో గురువారం వారి తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైనర్లు తెలిసీ తెలియని వయస్సులో వాహనాలు నడుపుతూ అనేక ప్రమాదాలకు కారకులు అవుతున్నారన్నారు. 18 సంవత్సరాలలోపు పిల్లలకు తల్లిదండ్రులు వాహనాలు ఇవ్వొద్దని సూచించారు. లైసెన్సు లేకుండా వాహనాలు నడిపితే చర్యలు తసుకుంటామన్నారు.


హైఓల్టేజీతో కాలిన టీవీలు, ఫ్యాన్లు

మోత్కూరు, జనవరి 4: యాదాద్రిభువనగిరి జిల్లా మోత్కూరు మునిసిపాలిటీ కేంద్రంలోని ఎస్‌ఎస్-1 ట్రాన్స్‌ఫార్మర్ పరిధిలోని అంగడిబజారులో హైఓల్టేజీతో బుధవారం రాత్రి పలువురి ఇళ్లలో టీవీలు, ఫ్యాన్లు, బల్బులు కాలిపోయాయి. మొదట విద్యుత్ వైర్ తెగిపడగా కొంతసేపటి తర్వాత విద్యుత్ సిబ్బంది వచ్చి తెగిన తీగను సరి చేశారు. ఆ తర్వాత కొంత సేపటికే హైవోల్టేజీతో ఇళ్లలో టీవీలు, ఫ్యాన్లు, బల్బులు కాలిపోయాయి. వెంటనే విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. విద్యుత్ సరఫరా నిలిచిపోయినప్పటికీ విద్యుత్ మీటర్లలో విద్యుత్ ఉన్నట్టు ఇండికేటర్లు చూపించాయి. పట్టణానికి నాగరాజు, యాదయ్య, లచ్చయ్య తదితరుల ఇళ్లలో టీవీల స్టెప్‌లైజర్లు కాలిపోయాయి. పలువురి ఇళ్లలో ఫ్యాన్లు, బల్బులు కాలిపోయాయి. ఒక్కో ఇంట్లో రూ.వెయ్యి, రూ.1500ల నష్టం జరిగింది. కేబుల్ టీవీబాక్స్‌లు కాలిపోయి సాయంత్రం వరకు కేబుల్ టీవీ ప్రసారాలు నిలిచిపోయాయి. మొదట తెగిన తీగను సరి చేసిన తర్వాత మరో తీగ తెగడంతో మిగతా విద్యుత్ వైర్లపై హైవోల్టేజీ వచ్చిందని విద్యుత్ ఏఈ హుస్సేన్ తెలిపారు. వెంటనే ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆపి వేసి లోపాన్ని సరిచేశామన్నారు.

అబ్బురపరిచిన చిత్రాలు

● నెమలి పింఛం, గోరుపై సీఎం రేవంత్‌రెడ్డి చిత్రాలు

మోత్కూరు, ఆత్మకూరు (ఎం), జనవరి 4: యాదాద్రి భువనగిరి జిల్లాకు చెందిన నెయిల్ ఆర్టిస్ట్ మహేశ్వరం నరహరి సీఎం రేవంత్‌రెడ్డికి వినూత్నరీతిలో నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఆత్మకూరు(ఎం) మండలం కొరటికల్ గ్రామానికి చెందిన ఆర్టిస్ట్ నరహరి ఏడాది కాలంగా పెంచుకున్న తన వేలి గోరుపై, నెమలి పింఛంపై సీఎం రేవంత్ రెడ్డి ముఖచిత్రాన్ని చిత్రించి అబ్బురపర్చాడు. నరహరి అమీర్‌పేటలోని సిస్టర్ నివేదిత స్కూల్లో డ్రాయింగ్ మాస్టర్‌గా పనిచేస్తున్నారు. తన చేతి వేలిగోళ్లపై పలు సామాజిక అంశాలు, ప్రముఖ రాజకీయ నాయకులు చిత్రాలు 140కి పైగా చిత్రీకరించి అవార్డులు, రివార్డులు అందుకున్నారు.



నెమలి పింఛం, గోటిపై వేసిన సీఎం రేవంత్‌రెడ్డి చిత్రాలు


ఆర్టిస్ట్ నరహరి

వరినారును సంరక్షిద్దాం

● రంగు మారుతున్న వరినాళ్లు ● రాత్రి ఉష్ణోగ్రతలు 14డిగ్రీలకు పడిపోవడంతో ప్రభావం ● ఆందోళన చెందుతున్న రైతులు


అడ్డగూడూరు మండలంలోని చౌళ్లరామారం సమీపంలో తెగుళ్ల బారిన వరినారు మడి

అడ్డగూడూరు, జనవరి 4: పెరిగిన చలి తీవ్రతతో వరినాళ్లు తెగుళ్ల బారిన పడుతున్నాయి. యాదాద్రిభువనగిరి జిల్లా అడ్డగూడూరు మండల వ్యాప్తంగా నీటి వసతి ఉన్న రైతులు సుమారుగా తొమ్మిది వేలు ఎకారాల విస్తీర్ణంలో నార్లు పోసుకున్నారు. డిమాండ్ ఉండే సన్నరకాలు ఎంపిక చేసుకుని నాళ్లు చల్లారు. రాత్రి ఉష్ణోగ్రతలు 14డిగ్రీలకు పడిపోవడంతో వరి నారుపై తీవ్ర ప్రభావం పడుతోంది. 10నుంచి 20 రోజులు గడిచినా నారు పెరగడం లేదు. కొన్ని చోట్ల నారు ఎరుపు రంగులోకి మారాయి. మరికొన్ని చోట్ల తెలుపు రంగులో మారుతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో ఆకులు పసుపు రంగులోకి మారాయి. నారుమళ్లన్నీ తెగుళ్ల బారినపడడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. తెగుళ్ల నివారణ చర్యల కోసం వ్యవసాయధికారుల సలహాలు తీసుకుంటున్నారు. కొందరు వివిధ రకాల పురుగు మందులు, యూరియా చల్లుతున్నా ఫలితం కనిపించడం లేదు. రైతులు మరోసారి వరినాళ్లు చల్లుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. నవంబరు, డిసెంబరు మాసాల్లోనే వరినాట్లు పూర్తి చేయాల్సి ఉండాగా, నారు ఇంకా చేతికి రాకపోవడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు.

చలి నుంచి కాపాడితేనే..

చలి తీవ్రత వల్లనే నారు దెబ్బతినే పరిస్థితులు ఏర్పడ్డాయని అడ్డగూడూరు మండల వ్యవసాయధికారి బి. అరుణకుమారి తెలిపారు. ఇనుప ధాతు(జింక్) లోపం కారణంగా నారుమళ్లు దెబ్బతింటున్నాయని, రైతులు నీటిని ఎక్కువగా పెట్టొదని సూచించారు. రోజు విడిచి రోజు నిటిని పెడుతూ తర్వాత నారుమళ్ల నుంచి తొలగించగించన్నారు. ఉదయం ఆరు గంటలకు బోరు నుంచి వచ్చే వేడినీటిని పెట్టి తర్వాత తొలగించాలని సూచించారు. రాత్రి నారుమడిలో నీరు నిల్వ ఉంచకూడదని పేర్కొన్నారు. నారుమడిపై ఒక అడుగు ఎత్తులో వెదురు బద్దలతో ఊచలు అమర్చి దానిపై ప్లాస్టిక్ కవర్లు కప్పాలని, ఇనుప ధాతు నివారణకు రెండు గ్రాముల జింక్‌ను లీటరు నీటిలో కలిపి చల్లుకోవాలని సూచించారు.

నారు పెరగడం లేదు



ఎకరన్నార పొలంలో నారు వేద్దామని రెండు బస్తాల వరి విత్తానాలను తుకం చల్లుకున్నాను. అది ఎంతకూ పెరగడం లేదు. దాదాపు 18రోజులుగా ఎదురు చూస్తున్నా. మొక్కలన్నీ పసుపు రంగులోకి మారి చనిపోతున్నాయి. నివారణకు కొన్ని మందులు చల్లినా ఫలితం కన్పించలేదు.

మందుల సోమయ్య, చౌళ్లరామరాం, అడ్డగూడూరు మండలం.

నాట్లు వేశాక తీసుకోవాల్సిన జాగ్రత్తలు

చౌటుప్పల్ టౌన్, జనవరి 4: వరి నాటేటప్పుడు, నాటిన తర్వాత ప్రతి రెండు మీటర్లకు 20 సెంటీమీటర్ల కాలి బాటలు తీయాలి. ఈ కాలి బాటలు ఉత్తర, దక్షిణ దిశల్లో ఉండాలి. కాలిబాటలతో గాలి, వెలుతురు పుష్కలంగా తాకడంతో చీడపీడల ఉధృతిని తగ్గిస్తుంది. ప్రధానంగా సుడి దోమను అరికడుతుంది. ముదురు నారు నాటే సమయంలో కొనలను తుంచాలి. దీంతో కాండం తొలిచే పురుగు ఉధృతిని తగ్గించవచ్చు.

- నాటు కంటే ముందు గాని, చివరి దుక్కిలో గాని పీఎస్‌బీసీ(భాస్వరాన్ని కరిగించే జీవన ఎరువు)ను వరి నారు నాటిన వారం లోపు గాని వాడితే కరగని స్థితిలో ఉన్న భాస్వరాన్ని కరిగిస్తుంది. ఈ పద్ధతిలో 25శాతం మేర డీఏపీని తగ్గించేందుకు అవకాశం ఉంటుంది.
- ఎకరాకు 100కిలోల యూరియాను మూడు సమాన భాగాలుగా చేయాలి. ఒక భాగం వరి నాటేందుకు ముందు, రెండో భాగం దుబ్బు చేసే(పిలక) దశలో, మూడో భాగం అంకురం దశలో వేయాలి. యూరియాను మూడు దశల్లో వేయడంతో వరి పంట బలిష్టంగా ఎదుగుతుంది.
- భాస్వరం ఎరువును దుక్కిలోనే వేయాలి తప్ప పైపాటుగా ఏ పరిస్థితుల్లోనూ వేయకూడదు.
- పొటాష్ ఎరువులను అంకురం దశలో వేస్తే గింజ గట్టిపడుతుంది. చీడ పురుగుల ఉధృతిని తగ్గించడానికి దోహదపడుతుంది.
- వరిని నాటిన మూడు రోజుల లోపుగా కలుపు నివారణకు బ్యూటక్లోర్ ఒక లీటరు లేదా ప్రిటిలా క్లోర్ 500 మిల్లీలీటర్లలో ఏదైనా ఒక దానిని 20 కిలోల ఇసుక లో కలిపి చల్లుకోవాలి.
- కాండం తొలుచు పురుగు నివారణకు 2.5 గ్రాముల చొప్పున కార్టాప్ ఎహైడ్రో క్లోరైడ్‌ను ఒక లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.
- చలి తీవ్రత ఎక్కుగా ఉన్నందున ఆకులపై ఎర్రటి మచ్చలు, తుప్పు మరకలు వస్తే 2 గ్రాముల చొప్పున జింక్ సల్ఫేట్‌ను ఒక లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.
- అగ్గితెగులు నివారణకు 0.6 గ్రాముల చొప్పున ట్రైసైక్లోజోల్‌ను ఒక లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

మోతాదుకు మించి మందులు పిచికారీ చేయవద్దు



వరి సాగులో మోతాదులకు మించి మందుల ద్రావకాలను పిచికారీ చేయవద్దు. తెగుళ్ల తొందరగా తగ్గించాలన్న ఆలోచనతో కొంతమంది రైతులు మోతాదుకు మించి రసాయనాలు పిచికారీ చేస్తుంటారు. దీంతో పంటలు మాడిపోయే అవకాశాలు ఉంటాయి. ఎకరాకు 200లీటర్లు అనగా 10 పంపుల ద్రావకాన్ని పిచికారీ చేయాలి.

● ముత్యాల నాగరాజు, చౌటుపల్ ఏవో,

శాస్త్రోక్తంగా నిత్యవిధి కైంకర్యాలు


సుదర్శన నారసింహ హవనం పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, జనవరి 4: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి పుణ్యక్షేత్రంలో గురువారం నిత్యవిధి కైంకర్యాలు, తిరుప్పావై వ్రత పూజలు ఆగమ శాస్త్రరీతిలో వైభవంగా కొనసాగాయి. ప్రభాతవేళ స్వయంభువులను సుప్రభాతంతో మేల్కొలిపిన ఆచార్యులు ఉత్తర దిశలోని మొదటి ప్రాకార మండపంలో వ్రత పూజలు నిర్వహించారు. గోదాదేవి ఆలపించిన తిరుప్పావై పాశుర పఠనం జరిపిన పూజారులు పాశుర వైభవాన్ని భక్తులకు వివరించారు. మహిళా భక్తులు అమ్మవారిని కొలుస్తూ మంగళ నీరాజనాలు పాడారు. అనంతరం ప్రాకార మండపంలో హోమం, నిత్యతిరుకల్యాణం కొనసాగాయి. అనుబంధ శివాలయంలో నిత్య పూ జలు శైవ సంప్రదాయరీతిలో నిర్వహించారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.25,64,062 ఆదాయం సమకూరినట్టు అధికారులు తెలిపారు.

భగవానుడి దర్శనంతో శుభ పరంపర: అష్టాక్షరీ జీయర్‌స్వామి

దనుర్మాసంలో భగవానుడి దర్శనంతో సకల శుభ పరంపరలు సంప్రాప్తిస్తాయని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, విజయవాడకు చెందిన శ్రీమదష్టాక్షరీ పీఠాధిపతి అష్టాక్షరీ సంపత్‌కుమార రామానుజ జీయర్‌స్వామి అన్నారు. గురువారం ఆయన తన శిష్యబృందంతో కలిసి యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి సన్నిధిని సందర్శించారు. యాత్రా సందర్శనకు విచ్చేసిన స్వామీజీకి అర్చకబృందం, అధికారులు ఆలయ మర్యాదలతో పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. స్వామిజీ ధ్వజస్తంభం వద్ద గరుత్మంతుడిని దర్శించుకుని గర్భాలయంలోని మూలమూర్తుల చెంత ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ప్రధానాలయ ముఖమండపంలో పండిత గోష్టి నిర్వహించి, అనుగ్రహభాషణం చేశారు. క్షేత్ర సందర్శన, భగవానుడిని దర్శించుకోవాలని ఎవరు ఎంత సంకల్పించినా నెరవేరదని, సాక్షాత్తు భగవానుడి అనుగ్రహం కలిగినప్పుడే అది సాధ్యమవుతుందన్నారు. తానూ ఎప్పటి నుంచో యాదగిరిక్షేత్రాన్ని సందర్శించాలని సంకల్పించగా, నేడు నెరవేరిందన్నారు. క్షేత్రంలో నిత్యవిధి కైంకర్యాలు శ్రీవైష్ణవ పాంచరాత్రాగమ శాస్త్రరీతిలో అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయన్నారు. స్వామిజీకి దేవస్థాన అధికారులు స్వామివారి శేషవస్త్రాలను, ప్రసాదాలు అందజేశారు. అంతకు ముందు స్వామీజీ అర్చకబృందం, భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

28 రోజుల్లో రూ.3.15కోట్ల ఆదాయం

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయ ఖజానాకు 28రోజుల్లో రూ.3.15కోట్ల హుండీ ఆదాయం సమకూరింది. యాదగిరిక్షేత్రాన్ని సందర్శించిన భక్తులు హుండీల్లో మొక్కు కానుకలుగా సమర్పించిన నగదు, నగలను గురువారం కొండకింద వ్రతమండపం రెండో హాల్‌లో దేవస్థాన సిబ్బంది లెక్కించారు. గత నెల 7వ తేదీ నుంచి ఈ నెల 3వ తేదీ వరకు క్షేత్రాన్ని సందర్శించిన భక్తులు హుండీల ద్వారా సమర్పించిన ఆదాయం రూ.3,15,05,035, మిశ్రమ బంగారం 100 గ్రాములు, మిశ్రమ వెండి 4.25కిలోలు ఆలయ ఖజానాకు సమకూరినట్లు దేవస్థాన ఈవో రామకృష్ణారావు వివరించారు. విదేశీ కరెన్సీ రూపంలో 2006 అమెరికా డాలర్లు, 355 ఆస్ట్రేలియా డాలర్లు, 195 కెనడా డాలర్లు, 30సింగపూర్ డాలర్లు, 155 ఇంగ్లండ్ పౌండ్‌లు, 20సౌదీ అరేబియా రియాల్స్, 5 యూరప్ యూరోలు, 1600 ఒమన్ రియాల్స్, 13 మలేషియా రింగెట్స్, 15 నేపాల్ రూపీలు, 2 ఖతార్ రియాల్స్, 240 థాయిలాండ్ భట్స్, 50 న్యూజిలాండ్ డాలర్లు, నాలుగు కువైట్ దినార్స్, 50 ఆఫ్రికా రండ్స్, 20 బంగ్లాదేశ్ టాకాలు, 2000 యుగాండ శిల్లింగ్స్, 11,000 ఇండోనేషియా రూపియాలు ఆలయ ఖజానాకు సమకూరినట్లు చెప్పారు. 2022 కార్తీకమాసంలో 20 రోజులకు రూ.2కోట్లకు పైగా ఆదాయం సమకూరగా, తొలిసారిగా రూ.3.15కోట్లకు పైగా ఆదాయం సమకూరింది.


శ్రీమదష్టాక్షరీ పీఠాధిపతి సంపత్‌కుమార జీయర్‌కు స్వాగతం పలుకుతున్న అర్చకులు

సైబర్ ఉచ్చుతో ఆర్థిక ముప్పు

● పెరుగుతున్న సైబర్ నేరాలు
● అప్రమత్తంగా ఉండాలంటున్న అధికారులు

సైబర్ నేరాల్లో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే మొదటి స్థానంలో ఉందని జాతీయ నేరాల నమోదు సంస్థ నివేదించడం ఆందోళన కలిగించే అంశం. 2022తో పోలిస్తే 2023లో నేరాలు పెరగగా.. అందులో సైబర్ నేరాలు 17.59 శాతం వరకు పెరిగాయి. సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడే నెటిజన్ల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. అందులో ప్రధానంగా మొబైల్ బ్యాంకింగ్, డిజిటల్ ట్రాంజెక్షన్స్ చేసే వారే అధికంగా ఉంటున్నారు. కాస్తో కూస్తో జ్ఞానమున్న వారే ఈ ఉచ్చులో పడుతుండగా మిడిమిడి జ్ఞానం ఉన్నవారి పరిస్థితేమిటి.. వారిని ఎలా అవగాహన కల్పించాలి అన్న కోణంలో ఆలోచిస్తుండగా అందుకనుగుణంగా పోలీస్, బ్యాంకింగ్ రంగాలు చర్యలు చేపడుతున్నాయి.

● మిర్యాలగూడ టౌన్.



ఎత్తుకు పై ఎత్తులు వేస్తూ

నగదు రహిత లావాదేవీలను క్యాష్ చేసుకుంటున్నారు సైబర్ నేరగాళ్లు. ఎత్తుకు పై ఎత్తులు వేస్తూ కంటికి కనబడకుండా ఖాతాల్లో డబ్బు మాయం చేస్తున్నారు. మొబైల్, డిజిటల్, ఆన్‌లైన్ బ్యాంకింగ్‌తో పాటు ఇతర ఆర్థిక లావాదేవీలు పెరుగుతున్నంతగానే సైబర్ నేరాలు పెచ్చుమీరుతున్నాయి. అలాంటి మోసాలకు బలవుతున్న వారిలో అన్నివర్గాలు వారూ ఉండటం ఆశ్చర్యానికి గురి చేసే విషయమే. ఇంతకాలం సామాజిక మాధ్యమాల్లో నకిలీ ఖాతాలు సృష్టించి కోట్లు కొల్లగొడుతున్న సైబర్ నేరగాళ్లు పంథా మార్చుకుని నకిలీ వ్యాపార సంస్థలతో మోసాలకు పాల్పడుతున్నట్లు పోలీసులు గుర్తించారు.

దృష్టి సారిస్తున్న ప్రభుత్వాలు

ఇంటర్నెట్ వేదికపై పెరుగుతున్న సైబర్ క్రైమ్స్‌ను అరికట్టేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టి సారించాయి. జాతీయ నేరాల నమోదు సంస్థ సహకారంతో సోషల్ మీడియా, డిజిటల్ ట్రాంజెక్షన్లపై సైబర్ గస్తీ ఏర్పాటు చేయగా స్టేట్ పోలీస్ డిపార్ట్‌మెంట్ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఏర్పాటు చేసింది. సైబర్ నేరాల నియంత్రణకు ఆర్థిక అక్షరాస్యత అవసరమని తలచిన ప్రభుత్వాలు అందుకనుగుణంగా అడుగులు వేస్తున్నాయి. గ్రామస్థాయి నుంచే ఆర్థిక అక్షరాస్యత కేంద్రాలను ఏర్పాటు చేస్తోంది కేంద్రప్రభుత్వం. నేషనల్ సెంటర్ ఫర్ ఫైనాన్షియల్ ఎడ్యుకేషన్ (ఎన్‌సీఎఫ్‌ఈ)పేరుతో ఏర్పాటు చేసిన ఈ కేంద్రాల ద్వారా మహిళలకు బ్యాంకింగ్, ఫైనాన్షియల్ ట్రాంజెక్షన్స్‌పై అవగాహన కల్పిస్తున్నారు. ఆర్బీఐ, సెబీ, ఐఆర్‌డీఏఐ, పీఎఫ్‌ఆర్‌డీఏ వంటి నియంత్రణ సంస్థల సహకారంతో శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేశారు.

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 11 అక్షరాస్యత కేంద్రాలు

సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడకుండా ఉండేందుకు ఉమ్మడి జిల్లాలో 11 అక్షరాస్యత కేంద్రాలు ఏర్పాటు చేశారు. నల్లగొండ జిల్లాలో మిర్యాలగూడ, అనుముల, నార్కెట్‌పల్లి, కొండమల్లేపల్లి, సూర్యాపేట జిల్లాలో కోదాడ, సూర్యాపేట, నడిగూడెం, యాదాద్రిభువనగిరి జిల్లాలో భువనగిరి, మోత్కూరు, తుర్కపల్లి, గుండాలలో ఏర్పాటు చేసి ఫైనాన్షియల్ లిటరసీ సెంటర్లలో అవగాహన కల్పిస్తున్నారు. ప్రతీ ఎఫ్‌ఎల్‌సీ కేంద్రంలో ఇద్దరు శిక్షణ పొందిన సిబ్బంది ఉంటారు. తమ పరిధిలోని మండలాలు, గ్రామాలను ఎంచుకుని అవగాహన కల్పిస్తున్నారు. స్వయం సహాయక సంఘాలు, రైతులు, కర్షకులు, కుటీర పరిశ్రమల వారిని గుంపులుగా ఏర్పాటు చేసి ఆర్థిక, మొబైల్, డిజిటల్, ఆన్‌లైన్ బ్యాంకింగ్ అంశాలపై ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. ఆర్థిక పొదుపు, జీవిత బీమా, రుణాలు, ఖాతాల నిర్వహణ తదితర అంశాలతో పాటు ప్రభుత్వ పథకాలు, ప్రయోజనాలపై అవగాహన కల్పిస్తున్నారు. అందుబాటులోకి వస్తున్న ఆధునిక సాంకేతికతో పాటే సైబర్ నేరాలూ పెరుగుతున్నాయి నిరక్షరాస్యులతో పాటు విద్యావంతులూ సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడుతున్నారు. అలా పడకుండా ఉండాలంటే కనీస పరిజ్ఞానం అవసరం. డిజిటల్ ట్రాంజెక్షన్ చేసే ముందు కాస్త ఆలోచించాలని, ఓటీపీ షేర్ చేయడంలో మరింత అప్రమత్తంగా ఉండాలంటున్నారు బ్యాంకింగ్ రంగ ఉన్నతాధికారులు.

అప్రమత్తంగా ఉండాలి



సైబర్ నేరాల పెరుగుదల ఆందోళన కలిగించే విషయమే. అయితే అప్రమత్తతతో సైబర్ నేరాల నివారణ సాధ్యమే. ప్రధానంగా మొబైల్, డిజిటల్, ఆన్‌లైన్ బ్యాంకింగ్ ట్రాంజక్షన్స్ చేసే వారు పరధ్యానంతో ఉండరాదు. నేరం జరిగిన తర్వాత దర్యాప్తు, రికవరీ కంటే నేరం జరగకుండా చూడాలన్నదే లక్ష్యం. ఆ సంకల్పంతోనే సైబర్ గస్తీ పెంచింది పోలీస్ శాఖ. ఇక ఆర్థిక అక్షరాస్యత కేంద్రాల ఏర్పాటు ఆహ్వానించదగినదే.. వాటి సేవలను మరింత విస్తరించాల్సిన అవసరముంది.

● పీ. వెంకటగిరి, మిర్యాలగూడ, డీఎస్పీ.

రైతు వేదికల్లో వీడియో కాన్ఫరెన్స్ సౌకర్యం

తొలత జిల్లాలోని ఒక్కో నియోజకవర్గంలోని ఒక్కో రైతు వేదిక ఎంపిక



నల్లగొండ, జనవరి 4: రాష్ట్ర ప్రభుత్వం రైతు వేదికలను రైతాంగానికి మరింత చేరువ చేయడానికి రైతు వేదికల్లో వీడియో కాన్ఫరెన్స్ సిస్టమ్‌ను ఏర్పాటు చేసేందుకు నిర్ణయం తీసుకుంది. ఈ నేపథ్యంలో జిల్లాలోని అన్ని మండలాలను సర్వే చేసిన యంత్రాంగం అందుకు సంబంధించిన నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి అందించింది. దీంతో మొదట జిల్లాలోని నియోజకవర్గానికి ఒక రైతు వేదికలో వీడియో కాన్ఫరెన్స్ సిస్టమ్ ఏర్పాటు చేయాలని యోచించి అందుకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందించింది. జిల్లాలోని ఆరు నియోజకవర్గాల్లో వీడియో కాన్ఫరెన్స్‌కు అనువైన, నెట్‌వర్క్ అందుబాటులో ఉన్న ప్రాంతాలను గుర్తించారు. నల్లగొండ నియోజకవర్గంలో జీకే.అన్నారం(వెలుగుపల్లి)లోని రైతు వేదికలో వీడియోకాన్ఫరెన్స్ సిస్టమ్‌ను ఏర్పాటు చేయనున్నారు. అదేవిధంగా మిర్యాలగూడలోని రైతు వేదిక, నాగార్జునసాగర్ నియోజకవర్గంలోని త్రిపురారం రైతు వేదికను, దేవరకొండలో స్థానికంగా రైతువేదికను గుర్తించి అందులో వీడియో కాన్ఫరెన్స్ సిస్టమ్‌ను ఏర్పాటు చేయనున్నారు. నకిరేకల్ నియోజకవర్గానికి సంబంధించి తాటికల్‌లోని రైతు వేదిక, మునుగోడు నియోజకవర్గం విషయానికి వస్తే మునుగోడులో స్థానికంగా రైతు వేదికలో వీడియో కాన్ఫరెన్స్ సిస్టమ్‌ను అమర్చనున్నారు. వీడియో కాన్ఫరెన్స్ సిస్టమ్స్, ఇతర పరికరాల కొనుగోలు కోసం రాష్ట్ర ప్రభుత్వం ఒక్కో నియోజకవర్గానికి రూ.3.50లక్షల చొప్పున నిధులను కేటాయించింది. నెట్‌వర్క్ విషయానికి వస్తే ప్రభుత్వరంగ సంస్థ బీఎస్‌ఎన్‌ఎల్‌తో పాటు టీఎస్‌స్వాన్ కూడా ఈ నెట్‌వర్క్‌ను ఉపయోగించుకోవాలని నిర్ణయించారు. ప్రస్తుతం ఈ రెండు సంస్థలకు సంబంధించిన కేబుల్ ఎంపిక చేసిన రైతు వేదికల వద్ద వరకు ఉండడంతో ఆయా నియోజకవర్గాల్లోని రైతు వేదికల్లో వీడియో కాన్ఫరెన్స్ సిస్టమ్స్‌ను ఏర్పాటు చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 140వరకు రైతు వేదికలు ఉన్నాయి. తొలత నియోజకవర్గానికి ఒకటి ఏర్పాటు చేసి ఆ తరువాత అన్ని రైతు వేదికలకు అవసరం అనుకుంటే విస్తరించే అవకాశాలు ఉన్నాయి. రాష్ట్రస్థాయిలో ముఖ్యమంత్రి నుంచి మొదలు మంత్రులు, రాష్ట్రస్థాయి అధికారులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించే సమావేశాలను దిశానిర్దేశం ద్వారా రైతు వేదికలను ఉపయోగించుకుని వ్యవసాయరంగాన్ని బలోపేతం చేయడం కోసం ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. నియోజకవర్గాల్లో జరిగే రైతు వేదికల వీడియో కాన్ఫరెన్స్‌ల్లో జిల్లా వ్యవసాయ అధికారులతో పాటు శాస్త్రవేత్తలు కూడా పాల్గొంటారు.

గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం కృషి

పెద్దఅడిశర్లపల్లి, జనవరి 4: గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం కృషి చేస్తుందని కాంగ్రెస్ జడ్పీ ఫ్లోర్ లీడర్ అలుగుబెల్లి శోభారాణిఏవిరెడ్డి అన్నారు. నల్లగొండ జిల్లా పెద్దఅడిశర్లపల్లి మండలకేంద్రంలోని యాదవకాలనీలో జడ్పీటీసీ నిధుల నుంచి రూ. 2 లక్షలతో రెండు బోర్లు వేయించి వాటికి మోటర్లు బిగించి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని అన్నారు. ఎదైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకరావాలని కోరారు.

తమ దృష్టికి వచ్చిన ప్రతి సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం మండల కేంద్రంలో రూ.92,500 సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. కాంగ్రెస్ పార్టీ గతంలో ప్రవేశ పెట్టిన సీఎం రిలీఫ్ కొనసాగుతూ వస్తుందని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ అలుగుబెల్లి వెంకటేశ్వరరెడ్డి, పిల్లి సత్యశ్రీయాదగిరి, ఎల్గూరి మధుసూధన్‌రెడ్డి, వైస్ ఎంపీపీ సరితా, వంగాల వెంకట్‌రెడ్డి, ఉపసర్పంచ్ అలుగుబెల్లి సుప్రితశ్రీనివాస్‌రెడ్డి, సీతారాం, రాజేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఎయిమ్స్ వద్ద బస్‌షెల్టర్లు లేక ఇక్కట్లు

● బస్సుల కోసం ఎండలో రోగుల పడిగాపులు
● ప్రమాదం అంచున రాకపోకలు



బీబీనగర్, జనవరి 4: వైద్యంకోసం ఎయిమ్స్‌కు వస్తున్న రోగులకు బస్టాప్ వద్ద ఇబ్బందులు ఎదర్కొంటున్నారు. ప్రతిష్టాత్మకమైన ఎయిమ్స్ వద్ద రోగులకు సౌకర్యవంతమైన బస్ షెల్టర్లు లేవు. ఎయిమ్స్ ఎదురుగా జాతీయ రహదారికి ఇరువైపులా హైదరాబాద్-వరంగల్ వైపు రాకపోకలు కొనసాగించే రోగుల సౌకర్యార్థం రెండు దిక్కులా బస్ షెల్టర్లు నిర్మించినప్పటికీ వరంగల్ వైపు నిర్మించిన బస్ షెల్టర్ బస్సులు ఆపేందుకు అనువుగా లేక నిరుపయోగంగా మారింది. ముఖ్యంగా భువనగిరి వైపు రాకపోకలు కొనసాగించే రోగులు సొంత గ్రామాలకు తిరిగి వెళ్లే సమయాల్లో ప్రమాదం అంచున ఎండలో రోడ్డు పక్కన నిలబడి బస్సుల కోసం పడిగాపులుకాస్తున్నారు. కొన్ని డిపోలకు చెందిన బస్సులు ఆపకపోవడంతో గంటల తరబడి ఎండలోనే నిలుచుంటున్నారు. వృద్ధులు, మహిళలు గర్భిణులు, దివ్యాంగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.



ఎయిమ్స్ వద్ద అనువుగా బస్ షెల్టర్ లేక ఎండలో బస్సుల కోసం పడిగాపులుకాస్తున్న ప్రజలు

గతంలో నిర్మించినా.. నిరుపయోగంగానే..



రోడ్డు క్రాసింగ్ ఎగువన నిరుపయోగంగా మారిన బస్ షెల్టర్

ఎయిమ్స్‌గా మారక ముందు అప్పటి నిమ్స్‌లో ఓపీ సేవలు కొనసాగిస్తున్న సమయంలో వైద్యం కోసం వచ్చే రోగుల ఇబ్బందులను గుర్తించి అప్పటి ఎంపీ బూర నర్సయ్య గౌడ్ ఎంపీ నిధులు వెచ్చించి రోడ్డుకు ఇరువైపులా హైదరాబాద్, వరంగల్ వైపు రాకపోకలు సాగించే రోగుల సౌకర్యార్థం బస్ షెల్టర్లు నిర్మించారు. అప్పుడు హైదరాబాద్ నుంచి వరంగల్ వైపు వెళ్లే ఆర్టీసీ బస్సులను కొండమడుగు మెట్టు సర్కిల్ వద్ద సర్వీస్ రోడ్డుకు దారి మళ్లించి నిమ్స్ మీదుగా బస్సులు నడిపే వారు. దాంతో బస్ షెల్టర్ వద్ద బస్సులు ఆగేవి. ప్రజలు సౌకర్యావంతంగా రాకపోకలు సాగించేవారు. కాగా నిమ్స్ కాస్త ఎయిమ్స్‌గా మారడం తర్వాత బస్సులు కూడా ఈ మార్గంలో రావడం మానేశాయి. ప్రస్తుతం ఎయిమ్స్‌లో ఓపీ సేవలు మొదలవ్వగా రోగుల సంఖ్య రోజురోజుకు పెరుగుతు వస్తోంది. బస్సులు కూడా గతంలో లాగా కొండమడుగు మెట్టు సర్కిల్ నుంచి సర్వీస్ రోడ్డు గుండా దారి మళ్లించి నడిపించినట్లయితే వరంగల్ వైపు నిర్మించి ఉన్న బస్ షెల్టర్ రోగులకు సౌకర్యవంతంగా ఉంటుంది. ఆర్టీసీ బస్సులు నేరుగా జాతీయ రహదారి వెంటే వెళుతుండడంతో వరంగల్, భువనగిరి వైపు నుంచి వైద్యం కోసం వచ్చి వెళుతున్న రోగులు ఇబ్బందిపడుతున్నారు. ఎయిమ్స్ సర్కిల్ వద్ద హైదరాబాద్ నుంచి వచ్చే వాహనాలు ప్రస్తుతం నిలుపుతున్న చోటుకు ఎగువన బస్ షెల్టర్ ఉండడంతో ఉపయోగపడకుండా నిరుపయోగంగా మారింది. దీంతో ప్రజలు సుదూర ప్రాంతాల నుంచి ఎయిమ్స్‌కు వచ్చి సొంత గ్రామాలకు తిరిగి వెళ్లే సమయంలో జాతీయ రహదారి పక్కన ఎండలో నిలబడి బస్సుల కోసం గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తోంది. దీంతో అనారోగ్యంతో ఆసుపత్రికి వచ్చిన రోగులు ఎండలో వేచి ఉండి, ఇబ్బందిపడుతున్నారు.

బస్ షెల్టర్ నిర్మించాలి



భువనగిరి నుంచి ప్రతీ నెల వైద్యం కోసం ఎయిమ్స్‌కు వస్తున్నా. ఇంటికి తిరిగి వెళ్లేందుకు బస్ షెల్టర్ లేక ఎండలోనే నిలుచుని, బస్సుల కోసం పడిగాపులు కాయాల్సి వస్తోంది. ఎండకు తల తిరుగుతోంది. కాళ్ల నొప్పులు వస్తున్నాయి. పెద్ద సార్లు కల్పించుకుని బస్ షెల్టర్ కట్టించాలి.

-గొలుసు నర్సమ్మ, భువనగిరి

బస్సులు ఆపడం లేదు



ఎయిమ్స్‌కు ఎలాగోలా వచ్చినా.. తిరిగి వెళ్లేందుకు రోడ్డు మీదికి వస్తే మందిని చూసి బస్సులను ఆపడం లేదు. కూర్చోవడానికి బస్ షెల్టర్ లేక ఎండలోనే ఉండాల్సి వస్తోంది. అధికారులు పట్టించుకుని అన్ని బస్సులు ఆపేలా చర్యలు తీసుకోవాలి.

-శివరాత్రి మహేశ్వరి, రామన్నపేట

రామన్నపేట ఎంపీపీపై అవిశ్వాసం

● ఆర్డీవోకు వినతిపత్రం అందజేసిన 10మంది ఎంపీటీసీలు



ఆర్డీవోకు వినతిపత్రం అందజేస్తున్న ఎంపీటీసీలు

రామన్నపేట, జనవరి 4: రామన్నపేట ఎంపీపీ కన్నెబోయిన జ్యోతిపై అవిశ్వాసం ప్రకటిస్తూ 10మంది ఎంపీటీసీ సభ్యులు గురువారం చౌటుప్పల్ ఆర్డీవోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీటీసీలు మాట్లాడుతూ ఎంపీపీ కన్నెబోయిన జ్యోతి మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ఎంపీటీసీల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోకుండా, అధికారాన్ని అడ్డం పెటుకుని నిధులు దుర్వినియోగం చేస్తూ, అవినీతికి పాల్పడుతూ ఇష్టానుసారంగా వ్యవహరుస్తున్నారని పేర్కొన్నారు. మండలం పరిషత్ తీర్మానాలకు వ్యతిరేకంగా ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటున్నారని ఆరోపించారు. 10మంది ఎంపీటీసీలం ఆమెకు మద్దతు ఉపసంహరిస్తున్నామని, తక్షణమే ఆమెను ఎంపీపీ పదవి నుంచి తప్పించాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో వైస్ ఎంపీపీ నాగటి ఉపేందర్, ఎంపీటీసీలు పూస బాలమణి, బడుగు రమేష్, ఎర్రోళ్ల లక్ష్మమ్మ, తిమ్మాపురం మహేందర్‌రెడ్డి, ఎండి.రేహన్, ఏనుగు పుష్పమ్మ, గోగు పద్మ, హర్షిణి పాల్గొన్నారు.

నిరంకుశ పాలనకు చరమగీతం పాడిన ప్రజలు



పాదయాత్రకు స్వాగతం పలుకుతున్న మునిసిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు

చౌటుప్పల్ టౌన్, జనవరి 4: రాష్ట్రంలో నిరంకుశ పాలనకు ప్రజలు చరమ గీతం పాడి కాంగ్రెస్ ఆధ్వర్యంలోని ప్రజా ప్రభుత్వానికి పట్టం కట్టడం అభినందనీయమని చౌటుప్పల్ మునిసిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఏర్పడిన సందర్భంగా హైదరబాద్‌లోని ఓయు ఆర్ట్స్ కాలేజీ నుంచి నల్లగొండ జిల్లాలోని చెర్వుగట్టు దేవస్థానానికి ఓయు జేఏసీ చైర్మన్ నోముల శేషు యాదవ్ ఆధ్వర్యంలో 25 మంది విద్యార్థులు చేపట్టిన పాదయాత్రకు గురువారం చౌటుప్పల్ పట్టణంలో చైర్మన్ రాజు స్వాగతం పలికారు. శేషు యాదవ్ బృందాన్ని రాజు సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పెద్దగోని రమేష్ గౌడ్, ఊదరి శ్రీనివాస్, ఊదరి యాదయ్య, ఊదరి రవి, పి.శివ, డి.అజయ్, కె.చరణ్ పాల్గొన్నారు. ఇదిలా ఉండగా స్థానిక బస్ స్టేషన్ ఆవరణలో హెచ్ఆర్‌సీ రైట్ టు ఇన్ఫర్మేషన్ ట్రస్ట్ (ఎన్‌జీవో సంస్థ) ఆధ్వర్యంలో అందజేస్తున్న రూ. 10 లకు ప్లేట్ బోజన కార్యక్రమాన్ని చైర్మన్ రాజు ప్రారంభించారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ బి. శ్యామ్ కుమార్, నాయకులు బొడిగే భాలకృష్ణ, మొగుదాల రమేష్, మలిగే మల్లేశ్, మలిగే బసవయ్య పాల్గొన్నారు.

రాచకొండను పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయాలి

సంస్థాన్‌నారాయణపురం, జనవరి 4: రాచకొండ ప్రాంతాన్ని పర్యాటకంగా మరింత అభివృద్ధి చేయాలని రాచప్ప సమితి అధ్యక్షుడు బద్దుల కృష్ణకుమార్ కోరారు. మండల కేంద్రంలో గురువారం సమితి సమావేశం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడతూ ఎంతో చారిత్రక ప్రాధాన్యం ఉన్న ఈ ప్రాంతంలో రాచరిక కట్టడాలు, దేవాలయాలు ఉన్నాయని తెలిపారు. శిథిలావస్థలో ఉన్న చారిత్రక కట్టడాలను పరిరక్షించి, పర్యాటక ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దాలన్నారు. సమావేశంలో సూరపల్లి వెంకటేష్, నిమ్మల నాగేష్, రాసాల వెంకటేష్, కడారి అంజిరెడ్డి, గాలయ్య, విడెం సాయికుమార్, దూసరి వెంకటేశం, ధనుంజయ పాల్గొన్నారు.

మట్టిని తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి



మట్టిని తరలిస్తున్న వాహనాలను అడ్డుకుని, నిరసన తెలుపుతున్న గ్రామస్థులు

తుర్కపల్లి, జనవరి 4: ప్రభుత్వ అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఎరుకల వెంకటేశ్‌గౌడ్ అధికారులను డిమాండ్ చేశారు. గురువారం గ్రామం నుంచి మట్టి లోడుతో వెళ్తున్న టిప్పర్లను గ్రామస్థులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ మండలంలోని తుర్కపల్లి, కోనాపూర్, వేల్పుపల్లి, వీరారెడ్డిపల్లి గ్రామాల గుండా మట్టిని అక్రమంగా తరలిస్తున్నారన్నారు. ఓవర్ లోడు కారణంగా రోడ్లు కూడా ధ్వంసమవుతున్నాయన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కరుణాకర్, ఉపసర్పంచ్ సిద్ధారెడ్డి, గ్రామస్తులు ధ్యానబోయిన మల్లేశం, కరుణాకర్, నల్ల శ్రీరాములు, సత్తయ్య, రామయ్య ఉన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

భువనగిరి టౌన్, జనవరి 4: భవన నిర్మాణ కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దాసరి పాండు అన్నారు. గురువారం భువనగిరిలో నిర్వహించిన భవన నిర్మాణ కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో లక్షలాది మంది కార్మికులు పని చేస్తున్న ఏకైక అసంఘటిత రంగం భవన నిర్మాణ కార్మిక రంగమని అన్నారు. ప్రభుత్వ పనులైన రోడ్లు, భవన నిర్మాణ పనుల్లో అడ్డా కూలీలైన స్థానిక భవన నిర్మాణ కార్మికులకు పని అవకాశం కల్పించాలన్నారు. రోజువారీ పనులు దొరక్కపోతుండడంతో వారి జీవితాలు దుర్లభంగా మారుతున్నాయన్నారు. సమావేశంలో జిల్లా సహాయ కార్యదర్శి మాయ కృష్ణ ప్రసాద్, సోములు, వెంకటేశం, రామకృష్ణ, లక్ష్మి పాల్గొన్నారు.

నూతన చట్టాలపై పునరాలోచన చేయాలి: ఐలు

భువనగిరి టౌన్, జనవరి 4: నూతన చట్టాలపై కేంద్ర ప్రభుత్వం పునరాలోచన చేయాలని ఐలు జిల్లా అధ్యక్షుడు మామిడి వెంకట్‌రెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నాగారం అంజయ్య డిమాండ్ చేశారు. భువనగిరి కోర్టులో గురువారం రాత్రి నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. క్షేత్ర స్థాయిలో అభిప్రాయాల సేకరణ జరుగకుండానే నూతన చట్టాలను రూపొందించడం సరికాదన్నారు. జిల్లాలోని అన్ని కోర్టులకు నూతన భవనాలు నిర్మించాలని, ఖాళీలను భర్తీ చేయాలన్నారు. జిల్లా కోర్టు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు వారాల నర్సిరెడ్డి, సూదగాని రవికుమార్, ఎస్ విద్యాసాగర్, జి.లింగయ్య, కిషన్, నాగేంద్రమ్మ, శ్రీకాంత్, చంద్రశేఖరరెడ్డి పాల్గొన్నారు.

భువనగిరి మండలంలో 19.7డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత

యాదాద్రి, జనవరి4(ఆంధ్రజ్యోతి): జిల్లాలో చలి తీవ్రత పెరిగిది. భువనగిరి మండలంలో గురువారం 19.7 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. బొమ్మలరామారం మండలంలో గరిష్టంగా 32.2డిగ్రీలు, నారాయణపురంలో కనిష్టంగా 20.8 డిగ్రీలు, గరిష్టంగా 30.6డిగ్రీలు, చౌటుప్పల్‌లో 28.4గరిష్టంగా, కనిష్టంగా 20.8, ఆత్మకూరులో 20.8 కనిష్టంగా, గరిష్టంగా 29.3, రామన్నపేటలో కనిష్టంగా19.8, గరిష్టంగా 29.5, యాదగిరిగుట్టలో కనిష్టంగా 20.6, గరిష్టంగా 30.4, మోటకొండూరులో కనిష్టంగా 20.3, గరిష్టంగా 30.2డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.


చిరువ్యాపారి కుటుంబానికి న్యాయం చేయాలి



ఆందోళనకారులకు నచ్చజెపుతున్న పోలీసులు

భువనగిరి టౌన్/ తుర్కపల్లి, జనవరి 4: చిరువ్యాపారి కుటుంబానికి న్యాయం చేయాలని బాధితుడి బంధువులు, మిత్రులు డిమాండ్ చేశారు. రుణ వాయిదా చెల్లించలేదంటూ వాహన ఫైనాన్స్ సిబ్బంది ద్విచక్ర వాహనాన్ని బలవంతంగా లాక్కెళ్లడంతో అవమానానికి గురై ఆత్మహత్య చేసుకున్న తుర్కపల్లి మండలం మోతీరాం తండాకు చెందిన చిరు వ్యాపారి లావూరి మంజానాయక్ కుటుంబ సభ్యులు భువనగిరిలోని వాహన ఫైనాన్స్ ముందు గురువారం ఆందోళనకు దిగారు. బుధవారం రాత్రి తండాలోని సొంతింటిలో ఆత్మహత్య చేసుకున్న మంజానాయక్ మృతదేహాన్ని భువనగిరి జిల్లా ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు గురువారం తండా వాసులు పెద్ద సంఖ్యలో ఆసుపత్రికి చేరుకుని పక్కనే ఉన్న ఫైనాన్స్ కార్యాలయం ఎదుట రహదారిపై బైఠాయించారు. దీంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. రూ.20వేలు రుణంగా తీసుకొని రూ.15వేలు చెల్లించగా మిగిలిన రూ.5వేల కోసం ఫైనాన్స్ సిబ్బంది బలవంతంగా బైక్‌ను లాక్కెళ్లడంతో సంచరిస్తూ పండ్లు విక్రయించి కుటుంబాన్ని పోషించుకునే మాంజా జీవనోపాధి కోల్పోయి మనోవేదనకు గురై ఆత్మహత్య చేసుకున్నాడని ఇందుకు బాధ్యులైన ఫైనాన్స్ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని బంధు మిత్రులు డిమాండ్ చేశారు. పట్టణ ఇన్‌స్పెక్టర్ ఎస్ సుధీర్‌కృష్ణ సంఘటనా స్థలానికి చేరుకుని బాధ్యులపై చర్యలు తీసుకుంటామని నచ్చ జెప్పడంతో ఆందోళనను విరమించారు. కాగా మంజా మృతదేహాన్ని తుర్కపల్లి మాజీ ఎంపీటీసీ నూనావతు ఉమ్లనాయక్ సందర్శించి, బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చారు. రూ.10వేలు ఆర్థిక సాయంగా అందజేశారు.

దారిపొడవునా కోతుల గుంపు



చిన్నపడిశాల గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద బారులు తీరిన కోతుల గుంపు

అడ్డగూడూరు, జనవరి 4: గ్రామాల్లో కోతుల సంఖ్య రోజు రోజుకూ పెరుగుతోంది. అడ్డగూడూరు మండలంలోని చిన్నపడిశాల గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద, చిన్నపడిశాల నుంచి చౌళ్లరామారం ప్రధాన రహదారిపై అధిక సంఖ్యలో కోతులు గుంపులుగా చేరాయి. దీంతో స్థానికులు, ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. చాలా సేపు అక్కడే నిరీక్షించి, కోతులు వెళ్లిపోయాక అక్కడినుంచి వెళ్లారు. కోతుల బెడద తీర్చాలని ప్రజలు కోరుతున్నారు.

చేనేత పరిరక్షణకు సమష్టిగా కృషి

● మునిసిపల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మీశ్రీనివాస్



సమావేశంలో మాట్లాడుతున్న మునిసిపల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మీశ్రీనివాస్

భూదాన్‌పోచంపల్లి, జనవరి 4: ' పోచంపల్లి చేనేత టైఅండ్‌డై ఇక్కత్ చీరలకు ఖండాంతరంగా మంచి గుర్తింపు ఉందని చేనేత పరిశ్రమ పరిరక్షణకు సమిష్టిగా కృషి చేద్దాం' అని భూదాన్‌పోచంపల్లి మునిసిపల్ చైర్‌పర్సన్ చిట్టిపోలు విజయలక్ష్మీశ్రీనివాస్ అన్నారు. భూదాన్‌పోచంపల్లిలోని పోచంపల్లి చేనేత టైఅండ్‌డై సిల్కు చీరల ఉత్పత్తి దారుల సంఘం 46వ వార్షిక మహాసభకు ఆమె ముఖ్య అతిథిగా మాట్లాడారు. చేనేత వస్త్ర వ్యాపారుల సంక్షేమం కోసం అసోసియేషన్ పాలక వర్గం కృషి చేయాలన్నారు. అసోసియేషన్ అధ్యక్షుడు తడక రమేష్ అధ్యక్షతన జరిగిన ఈ మహాసభలో ప్రథమ మండల అధ్యక్షుడు బడుగు దానయ్య, ఆల్ ఇండియా హ్యాండ్లూమ్ బోర్డు మాజీ డైరెక్టరు కర్నాటి ధనుంజయ, పద్మశాలి మహాజన సంఘం అధ్యక్షుడు సీత శ్రీరాములు శ్రేష్ఠి, ఆలిండియా హ్యాండ్లూమ్ హౌజ్ మాజీ డైరెక్టర్ భారత వాసుదేవ్, పోచంపల్లి కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు చైర్మన్ కర్నాటి బాలసుబ్రహ్మణ్యం, మార్కండేశ్వరస్వామి దేవాలయం అధ్యక్షుడు బడుగు చండికేశ్వర్, ఏకెఎల్‌బీ హ్యాండ్లూమ్ మార్కెట్ అధ్యక్షుడు కస్తూరి సుదర్శన్, అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి భారత లవకుమార్, చేనేత నాయకులు కర్నాటి నర్సింహ, కుడికాల రామనర్సింహ, ఈపూరి ముత్యాలు, గంజి బాలరాజు, సీత లక్ష్మణ్, ఎన్నం శివకుమార్ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం...

వలిగొండ: మండలంలోని గోకారం, జాలు కాలువ గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు దివీస్ లేబోరేటరి లిమిటెడ్ వారి సౌజన్యంతో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. విద్యార్థులను పరీక్షించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. సర్పంచ్‌లు, తుర్కపల్లి మాధవి, సురేందర్, మద్దెల సందీప్‌కుమార్, వైద్యుడు డాక్టర్ జయంత్‌కుమార్; దివీస్ ప్రతినిధులు వెంకటరాజు, సాయి కృష్ణ పాల్గొన్నారు.

వలిగొండ: మండలంలోని నర్సాయిగూడెం గ్రామానికి చెందిన ఏ కావ్య అనారోగ్యానికి గురి కావడంతో వైద్య ఖర్చుల నిమిత్తం రూ.1లక్ష ఎల్‌వోసీ చెక్కును భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అందజేశారు. ఎంపీపీ నూతి రమేష్‌రాజు, ఎంపీటీసీ పసల జ్యోతి, శ్రీనివాస్ ఉన్నారు.

భువనగిరి అర్బన్ : విద్యార్థులు బాగా చదువుకుని వార్షిక పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలని ఇంటర్మీడియట్ నోడల్ అధికారి రమణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి 28 నుంచి నిర్వహించే పరీక్షలకు విద్యార్థులు సన్నద్ధం కావాలని కోరారు. వచ్చే ఫిబ్రవరి 1 నుంచి ప్రాక్టికల్ పరీక్షలు, 16న ప్రథమ సంవత్సరం ఇంగ్లీష్ ప్రాక్టికల్, 17న ఎథిక్స్ హ్యూమన్ వాల్యూస్, 19న ఎన్విరాన్మెంట్‌పై పరీక్షల నిర్వహించనున్నట్లు తెలిపారు.

బొమ్మలరామారం: భువనగిరి సీఎస్ఎన్ఆర్ జూనియర్ కాలేజ్ గ్రౌండ్‌లో నిర్వహించే జిల్లా స్థాయి గ్రామీణ క్రీడలు, సంక్రాంతి సంబురాల పోస్టర్‌ను మండల కేంద్రంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో హమీద్, పాషా, బెల్లి చంద్రశేఖర్, యాదవ్, ర్యాకల రమేష్, పొలగోని వెంకటేష్‌గౌడ్, రాజమల్లారెడ్డి, రాసాల ప్రవీణ్, వేణుమాదవ్ పాల్గొన్నారు.

రాజాపేట: మండలంలోని బేగంపేట గ్రామంలో సీపీఐ నాయకుడు జిట్ట రాంచంద్రారెడ్డి 30వ వర్ధంతిని సీపీఐ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన స్మారకస్తూపం వద్ద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి చిగుర్ల లింగం, మూల హరినాథ్, మూల పోశయ్య, బాహుపేట వెంకటయ్య పాల్గొన్నారు.

భువనగిరి టౌన్ : అందుల జీవితాల్లో అక్షర జ్ఞానం పంచిన బ్రెయిలీ 215వ జయంతిని పురస్కరించుకుని భువనగిరిలో ఆయన చిత్రపటాల వద్ద ఘన నివాళులు అర్పించారు. సామూహిక ప్రాంతాల్లో బ్రెయిలీ లిపిని అందుబాటులో ఉంచాలని, శాతంతో నిమిత్తం లేకుండా అంధులందరికీసదరం సర్టిఫికెట్లు ఇవ్వాలని ఎన్‌పీఆర్‌డీ జిల్లా ప్రధాన కార్యదర్శి వనం ఉపేందర్ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బొల్లేపల్లి స్వామి, కొత్త లలిత, అంజన్ శ్రీ నాగరాణి, రత్నం యాదగిరి, పి.జనార్దన్, గోపి పాల్గొన్నారు.

భువనగిరి టౌన్: భువనగిరి పట్టణం ప్రధాన రహదారి వెంట ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించేలా ఏర్పాటు చేసిన దుకాణాల బోర్డులను ట్రాఫిక్ పోలీసులు తొలగించారు. తొలగించిన బోర్డుల స్థానంలో తిరిగి ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ట్రాఫిక్ సీఐ మధుసూదన్, ఎస్ఐలు వెంకటేశ్, విజయ్, కృష్ణమూర్తి హెచ్చరించారు. అలాగే సక్రమంగా పార్కింగ్ చేయని వాహనదారుల పట్ల కఠిన చర్యలు తీసుకుంటామని, అవసరం అయితే వాహనాలను సీజ్ చేసి కేసులు నమోదు చేస్తామని పేర్కొన్నారు.

చౌటుప్పల్ టౌన్ : ప్రజల్లో ఆధ్యాత్మికతను పెంపొందించేందుకు బ్రహ్మకుమారీస్ మెడిటేషన్ సెంటర్ విశేష కృషి చేస్తోందని చౌటుప్పల్ ఆర్డీవో జగన్నాథరావు అన్నారు. బ్రహ్మకుమారీస్ సంస్థ రూపొందించిన 2024 క్యాలెండర్‌ను గురువారం మునిసిపల్ కమిషనర్ భాస్కరరెడ్డితో కలిసి ఆర్డీవో జగన్నాథరావు ఆవిష్కరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ హరికృష్ణ, డీపీవో శ్రీనివాస్, మాధురి, బ్రహ్మకుమారీస్ మెడిటేషన్ సెంటర్ నిర్వహాకురాలు స్వర్ణలత పాల్గొన్నారు.

ఆలేరు రూరల్ : సామాజిక సేవలో విశ్రాంత ఉద్యోగులు భాగస్వాములు కావాలని ఇన్‌చార్జీ ఎస్టీవో ఎండి.ఖదీర్ అన్నారు. గురువారం ఆలేరులో తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నూతన సంవత్సర డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు.

మోత్కూరు : గత ప్రభుత్వం అమలు చేసిన చేనేత పథకాలు ఈ ప్రభుత్వం కూడా కొనసాగించాలని చేనేత కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గుండు వెంకటనర్సు డిమాండ్ చేశారు. మోత్కూరులో ఆయన విలేకరులతో మాట్లాడారు. చేనేత మిత్ర పథకంలో నూలుపై 40 శాతం సబ్సిడీ ఇవ్వడంలో ప్రస్తుత ప్రభుత్వం తాత్సారం చేస్తోందని విమర్శించారు. పెరిగిన నూలు, రంగులు, రసాయనాల ధరలతో చేనేత కుటుంబాలు వస్త్రాలు నేయలేక ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు.

ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేరుస్తాం

● ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి



భువనగిరిలో దరఖాస్తులను స్వీకరిస్తున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి

ఆంధ్రజ్యోతి-న్యూస్‌నెట్‌వర్క్: కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ప్రతీ హామీని నెరవేరుస్తుందని ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. గురువారం భువనగిరిలో నిర్వహించిన ప్రజా పాలనలో అయన మాట్లాడారు. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య దళారీ వ్యవస్థను నిర్మూలించేందుకే ప్రజా పాలన పేరిట ప్రభుత్వమే ప్రజల వద్దకు వస్తోందన్నారు. అర్హులందరికీ ఆరు గ్యారంటీ పథకాల లబ్ధిని చేకూర్చడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఆయా కార్యక్రమాల్లో మునిసిపల్ చైర్మన్ ఎనబోయిన ఆంజనేయులు, ఆర్డీవో అమరేందర్, ఏఆర్డీవో నాగిరెడ్డి, మునిసిపల్ కమిషనర్ బి నాగిరెడ్డి, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారంటీ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని జడ్పీ డిప్యూటీ సీఈవో డి.శ్రీనివాసరావు, ఎంపీడీవో గుత్తా నరేందర్‌రెడ్డి తహసీల్దార్ ఎం.అంజిరెడ్డి కోరారు. భువనగిరి మండలంలోని జమ్మాపూర్, వడాయిగూడెం, కూనూరు, చీమలకొండూరు, గౌస్‌నగర్ గ్రామాల్లో గ్రామ సభలు జరిగాయి. గుండు మనీష్ గౌడ్, అంకర్ల సంజీవ, జీలుగు కవిత, ఈర్ల పుష్పమ్మ ఉన్నారు.

● ఆత్మకూరు(ఎం) మండలంలో పారుపల్లి, కొరటికల్ గ్రామాల్లో ప్రజలనుంచి అధికారులు దరఖాస్తులను స్వీకరించారు. డీఎల్‌పీవో యాదగిరి, ఇన్‌చార్జి తహసీల్దార్ పార్థసింహారెడ్డి. ఎంపీడీవో నిరంజన్, సర్పంచులు లగ్గాని రమేష్, కోల సత్తయ్య, ఎంపీవో పద్మావతి, ఆర్ఐ మల్లికార్జున్‌రావు పాల్గొన్నారు.



చౌటుప్పల్ మండలం తూప్రాన్‌పేటలో దరఖాస్తులను స్వీకరిస్తున్న ఎంపీపీ తాడూరి వెంకట్‌రెడ్డి

● అడ్డగూడూరు మండలంలోని గట్టుసింగారం గ్రామంలో 515 దరఖాస్తులు స్వీకరించారు. తుంగతుర్తి సీపీవో మాన్యానాయక్, ఎంపీడీవో చంద్రమౌళి, తహసీల్దార్ శేషగిరిరావు, సర్పంచ్ సత్తయ్య ఉన్నారు.

● మోత్కూరు మండలంలోని దత్తప్పగూడెం గ్రామంలో నిర్వహించిన ప్రజా పాలన సదస్సులో జిల్లా ప్రణాళికాధికారి మాన్యానాయక్ మాట్లాడారు. ఆ గ్రామ ప్రజా పాలనలో 808 దరఖాస్తులు వచ్చాయి. సర్పంచ్ ఎలుగు శోభసోమయ్య అధ్యక్షతన జరిగిన ప్రజా పాలన సదస్సులో మండల ప్రత్యేక అధికారి పి.యాదయ్య, తహసీల్దార్ డి.రాంప్రసాద్, ఎంపీడీవో పి.మనోహర్‌రెడ్డి, ఎంపీటీసీ ఎ.లక్ష్మణాచారి, ఏవో కె.స్వప్న పాల్గొన్నారు మండలంలో గురువారం 917 దరఖాస్తులు వచ్చాయని ఎంపీడీవో పి.మనోహర్‌రెడ్డి, మునిసిపాలిటీలో 885 దరఖాస్తులు వచ్చాయని కమిషనర్ సి.శ్రీకాంత్ తెలిపారు.

● వలిగొండ మండలంలోని నాగారం, పులిగిల్ల గ్రామాల్లో ఎంపీపీ నూతి రమేష్‌రాజు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ప్రజా పాలనను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సర్పంచ్‌లు తీగల కృష్ణయ్య, జక్క వెంకట్‌రెడ్డి, ఎంపీటీసీలు బెలిదె సునీతా నాగేశ్వర్, తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీడీవో గీతారెడ్డి, ఏవో అంజనీదేవి, ఎంపీవో కేదారీశ్వర్, ఆర్ఐ మనోహన్ పాల్గొన్నారు.

● మోటకొండూర్ మండలంలోని చందేపల్లి, తేర్యాల గ్రామాల్లో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో తహసీల్దార్ శాంతిలాల్, ఎంపీడీవో వీరస్వామి, ఎంపీటీసీ నెమ్మాని స్వప్నసుబ్రహ్మణ్యం, గంగుల సంజీవరెడ్డి, సామ భూపాల్‌రెడ్డి, సర్పంచ్ పంజాల సత్యనారాయణ, ఆత్మకూర్ పీఏసీఎస్ వైస్ చైర్మన్ గందమల్ల జహంగీర్ పాల్గొన్నారు.

● తుర్కపల్లి మండలంలోని వాసాలమర్రి, కొండాపూర్, గోపాల్‌పూర్, నాగాయపల్లిగ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించారు. జడ్పీ సీఈవో సీహెచ్.కృష్ణారెడ్డి, మండల ప్రత్యేకాధికారి శ్యాంసుందర్, ఎంపీడీవో ఉమాదేవి, తహసీల్దార్ దేశ్యా, ఎంపీటీసీ కోమటిరెడ్డి సంతోషభాస్కర్‌రెడ్డి, పలుగుల నవీన్‌కుమార్, సర్పంచ్‌లు పోగుల ఆంజనేయులు, ఎంపీఓ వెంకటేశ్వర్లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

● చౌటుప్పల్ మండలం తూప్రాన్‌పేట, కుంట్లగూడెం గ్రామాల్లో నిర్వహించిన ప్రజాపాలనలో ఎంపీపీ తాడూరి వెంకట్‌రెడ్డి మాట్లాడారు. ప్రత్యేక అధికారి శ్రీలక్ష్మి, ఎంపీడీవో సందీప్‌కుమార్, సర్పంచ్ చక్రం జంగయ్య, ఏనుగు బాలమణి పాల్గొన్నారు. ప్రజల సమస్యల పరిష్కారానికే ప్రజాపాలన కార్యక్రమమని చౌటుప్పల్ మునిసిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు అన్నారు. చౌటుప్పల్ మునిసిపల్‌లోని 14వ వార్డు, 16వ వార్డులలో గురువారం దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో చౌటుప్పల్ ఆర్డీఓ జగన్నాథరావు, ఫారెస్ట్ ఆఫీసర్ పద్మజారాణి, మునిసిపల్ కమీషనర్ సోలిపురం భాస్కరరెడ్డి, కౌన్సిలర్స్ సందగల్ల విజయసతీష్, ఎండి.బాబాషరీఫ్, పోలోజు శ్రీధర్‌బాబు, గోపగోని లక్ష్మణ్, మాజీ ఎంపీపీ చిక్క నర్సింహ పాల్గొన్నారు.

● భూదాన్‌పోచంపల్లి మండల పరిధిలోని కనుముకుల, దంతూరు గ్రామాల్లో జరిగిన ప్రజా పాలన కార్యక్రమాల్లో ఎంపీపీ మాధ్గుల ప్రభాకర్‌రెడ్డి, జడ్పీటీసీ కోట పుష్పలత మల్లారెడ్డి, వైస్ ఎంపీపీ పాక వెంకటేష్‌యాదవ్, మండల ప్రత్యేకాధికారి విద్యాసాగర్, పీఆర్ ఏఈ వెంకటేశం, సర్పంచులు కోట అంజిరెడ్డి, దోటి కుమార్, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షురాలు బత్తుల మాధవి శ్రీశైలంగౌడ్, ఎంపీడీవో ఎ.బాలశంకర్, తహసీల్దార్ బి.వీరాబాయి, ఆర్ఐ వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.